
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 30.09.2016, శుక్రవారం
సంపుటి : 36 సంచిక : 17
పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# పాక్‌కు షాక్

- గర్జించిన భారత సింహాలు
- హతమైన ఉగ్రమూకలు
- ఎలాంటి సవాల్‌కైనా ఆర్మీ సమాయత్తం
- సరిహద్దుల వెంట అప్రమత్తం

**ఆపండిరా... ఉగ్రవాదాన్ని ఆపండిరా అన్నాం... విన్నారా? ఈ తూటాలు ఆపండిరా అని కోరాం... చెవికెక్కించుకున్నారా? రక్తపాతాన్ని ఆపమన్నాం, విధ్వంసాలు వద్దన్నాం... మనసుకెక్కించుకున్నారా? పదేపదే శాంతి మంత్రం పఠిస్తుంటే మేం సాధువులం అనుకున్నారా? మీరు దాడులు చేసినప్పుడల్లా స్నేహహస్తం చూపితే చేతకాని వాళ్లనుకున్నారా? దొంగదాడులు చేసి వెనుక నుండి మమ్మల్ని చంపి ఆనందించడం కాదురా... మీ గడ్డమీదకొచ్చి మీ ఎదురుగా నిలబడి మీరు పెంచి పోషిస్తున్న ఉగ్రవాదుల గుండెల్లో తూటాలు దించాం... ఇదిరా మొనగాడి దెబ్బ... భారత సైనికుడి సత్తా!**

భారత సైన్యం ఇచ్చిన షాక్‌కు పాకిస్థాన్ దిమ్మ తిరిగింది. యూరి సెక్టార్‌పై దాడితో కుతకుత ఉడికిపోతున్న భారత జవానులు అవకాశం వచ్చిందే అదనుగా ఉగ్రవాద మూకలపై రెచ్చిపోయారు. ఉగ్రవాదులను కసితీరా కాల్చి చంపారు. 28వ తేదీ అర్ధరాత్రి పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత పారామిలటరీ దళాలు అకస్మాత్తుగా సర్జికల్ దాడులు నిర్వహించాయి. 7ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి 38మంది ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. ఉగ్రవాదులకు శిక్షణనిస్తున్న ఇద్దరు పాక్ సైనికులు కూడా ఈ దాడిలో మృతి చెందగా, మరో 9మంది పాక్ సైనికులు గాయపడ్డట్లు తెలుస్తోంది. యూరీ దాడి తర్వాత పాకిస్థాన్‌పై పగతో రగిలిపోతున్న భారత జాతి యావత్తు ఈ దాడిపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ వీరజవానులకు జేజేలు పలికింది.

(మిగతా 11వ పేజీలో)

# కక్షపై... దీక్ష


3లో






# నేతలకు... ప్రతిదీ మేతే!

- కురుగొండ్లా... అనకొండా...?
- బెంబేలెత్తుతున్న కాంట్రాక్టర్లు
- కదలిరాని పారిశ్రామికవేత్తలు



(వివరాలు 12వ పేజీలో)

# సోమశిలకు జల సిరులు



నెల్లూరుజిల్లాలో ఎండలు మండుతున్నా, వర్షాలు కురవకున్నా కృష్ణా, గుంటూరు, కర్నూలు జిల్లాల్లో కురిసిన వర్షాలు మనకు వరంగానే మారాయి. నెల్లూరుజిల్లా రైతాంగానికి కల్పతరువు లాంటి సోమశిల రిజర్వాయర్‌ను గత కొన్నేళ్లుగా కూడా శ్రీశైలం రిజర్వాయర్ నింపుతోంది. పెన్నా నదికి ఇటీవల కాలంలో పెద్దగా వరదలు లేవు. గతేడాది మాత్రం భారీ వర్షాలతో వరదలొచ్చాయి. పదేళ్లకాలంగా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారానే సోమశిలకు నీళ్లు వస్తున్నాయి. దివంగత నేత వై.యస్. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణ నాయకుల అభ్యంతరాలను సైతం లెక్క చేయకుండా వై.యస్. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యం పెంచి సోమశిలకు నీటి విడుదల పరిణామం పెంచారు. ఆయన ఆ పని చేయబట్టే ఈరోజు సోమశిలలో 74టిఎంసీల పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేయగలుగుతున్నాం. కృష్ణ నీళ్లతోనే నెల్లూరుజిల్లాలో రెండు పంటలకు నీళ్లు ఇవ్వగలగుతున్నాం.

ఈ ఏడాది కూడా సోమశిల నీళ్లే జిల్లా రైతాంగానికి దిక్కవుతున్నాయి. శ్రీశైలం నిండడం, అదే సమయంలో సోమశిల ఎండిపోవడంతో, శ్రీశైలం నుండి నీటిని విడుదల చేస్తున్నారు. ఇప్పటికే 30 టీఎంసీల దాకా సోమశిలకు చేరాయి. మరో 10టీఎంసీలు కూడా రావచ్చు. సోమశిల నుండే చెన్నైకు తాగునీటిని పంపించాలి. అక్టోబర్ 15న సాగునీటి సలహా బోర్డు సమావేశం నిర్వహించి నీటి పంపకాలపై చర్చించనున్నారు. నవంబర్‌లో జిల్లాలో వర్షాలు పడితే సోమశిలతో పాటు కండ్లేరు రిజర్వాయర్, చెరువులు, బావులు నిండితే ఈ ఏడాది ఈజీగా గట్టెక్కేయవచ్చు.

# పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

**- మాజీమంత్రి ఆదాల**

పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు చేపట్టి అమలుచేస్తోందని మాజీమంత్రి, టిడిపి రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకరరెడ్డి అన్నారు. ఈనెల 24న ఆయన నెల్లూరురూరల్ మండలం, వనంతోపుకు వచ్చారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమైన నెల్లూరు జడ్పీటిసి సభ్యురాలు యాకసిరి రమకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన 10 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ, యాకసిరి రమ పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించగా, వెంటనే స్పందించిన ఈ సాయం మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదాలతో పాటు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, విజయా డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, డిసిసిబి డైరెక్టర్ కోడూరు కమలాకర్‌రెడ్డి, టిడిపి ఉపాధ్యక్షుడు ఆనం జయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బార్‌ల లైసెన్సులు పొడిగింపు

బార్ లైసెన్స్‌ల గడువును మరో మూడు నెలలు వరకు పొడిగిస్తూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిందని నెల్లూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ టి.శ్రీనివాసరావు వెల్లడించారు. నెల్లూరులోని కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 39బార్లు ఉన్నాయని, వీటి కాలపరిమితి ఈ నెలాఖరుకు ముగియనుందన్నారు. నూతన పాలసీ రాకపోవడంతో లైసెన్స్‌ను డిసెంబర్ నెలాఖరు వరకు పొడిగించారన్నారు. జనవరి నెల నుంచి నూతన పాలసీ అమలులోకి రానుందన్నారు. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2వ తేదీ జిల్లాలో మద్యం అమ్మకాలను నిషేధించామన్నారు. డ్రైడే రోజు మద్యం విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మార్పీ ఉల్లంఘించిన 23మద్యం దుకాణాలపై కేసులు నమోదు చేసి రూ.23లక్షలు జరిమానా విధించామన్నారు. జిల్లాలో నవోదయం కార్యక్రమం ద్వారా సారాను కట్టడి చేస్తామన్నారు. ఎవరైనా సారాయి, గంజాయి విక్రయాలు సాగిస్తుంటే సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచి వారికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు.

### శక్తి శేషయ్య నేతృత్వంలో...

# అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు

నెల్లూరులోని శ్రీనివాస అగ్రహారం, శ్రీ పులిమి రమేష్‌రెడ్డి ప్రాంగణంలో వున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో అక్టోబర్1 నుంచి 11వ తేది వరకు శక్తి శేషయ్య నేతృత్వంలో ఎంతో వైభవంగా అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగునున్నాయి. 1వతేది ఉదయం 8.25గంటలకు నెల్లూరులోని శ్రీ మహేశ్వరి పరమేశ్వరి కళ్యాణ మండపాల అధినేత చాకిరాల శేషయ్య (శక్తి శేషయ్య)–నాగభూషణమ్మ దంపతుల ఉభయకర్తృత్వంలో చండి అమ్మవారి పూజ ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు లలితా సహస్రనామ పూజ, అష్టోత్తర పూజ, ఖడ్గమాల, త్రిశతి, చండీదేవి అష్టోత్తరం నిర్వహిస్తామని, 1 నుంచి 11వ తేది వరకు ఒక్కోరోజు ఒక్కో విశిష్టమైన అలంకారంతో, విశేషమైన పూజలతో అమ్మవారు దర్శనమిస్తారని నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి భక్తబృందాలైన శ్రీనివాస అగ్రహారం, రామ్మూర్తినగర్, వెంకట్రామాపురం భక్తమండలి ఆధ్వర్యంలో ఈ వేడుకలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. 11వ తేది సాయంత్రం 6 గంటలకు అమ్మవారి నగరోత్సవం వేడుకగా వుంటుందని, భక్తులందరూ ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తరించాలని విజ్ఞప్తి చేశారు.

# శతాబ్దాన్ని వెలిగించిన కవి శేషేంద్ర


**ఆధునిక మహాభారతం - ఒక విశ్లేషణ**



డాక్టర్ బీరం సుందరరావు
సెల్‌ఫోన్ : 98480 39080

***"కాలాన్ని నా కాగితం చేసుకుంటా***
***దాని మీద లోకానికి ఒక స్వప్నం రాసి ఇస్తా***
***దాని కింద నా ఊపిరితో సంతకం చేస్తా"***

––అంటూ.. కలంతో కాలపత్రం మీద చెరగని సంతకం చేసిన మన తరం మహాకవి శేషేంద్ర. సరికొత్త శబ్దాలతో, భావ స్వప్నాలతో శతాబ్దాన్ని వెలిగించిన కవి శేషేంద్ర. పట్టిన ప్రతి పదాన్ని కవితామయం చేసి, ముట్టిన ప్రతి భావాన్ని ముత్యంగా మార్చిన శబ్దమాంత్రికుడు శేషేంద్ర! శేషేంద్ర కలం హలమెత్తిన రైతు గళం. పీడితుల పక్షాన నిలిచిన పోరాటనాదం. రేపటితరం కవులు పఠించుకునే నిత్య పాఠ్యగ్రంథం. తుదిశ్వాస వరకు ప్రజాక్షేత్రాల్లో ప్రవహించిన శేషేంద్ర అసలైన ప్రజాకవి. కాలం వెంట నడచిన కవి. కాలం కంటే ముందు నడచిన కవి. కవిత్వంతో కాలాన్ని గెలిచిన కవి. కవిత్వమై జనంలో నిలిచిన కవి. మహాకవి గుంటూరు శేషేంద్రశర్మగారు రచించిన 'ఆధునిక మహాభారతం' మానవ చైతన్యానికి ప్రతీక. అందులోని ప్రతి కవిత, ప్రతి అభివ్యక్తీ కవి సామాజిక దృష్టికి పతాక. నిజం చెప్పాలంటే––మానవ జీవితమే ఒక మహాభారతం.



ఆధునిక మహాభారతం
ప్రతులకు : సాత్యకి
ఫోన్: 9441070985, 7702964402
satyaki@gmail.com

భారతంలో పర్వాల్లాగే జీవితంలోనూ భిన్న పర్వాలుంటాయి. పార్శ్వాలుంటాయి. భారతంలో అన్యాయాన్ని, అధర్మాన్ని అంతం చేయడానికి అర్జునుడు గాండీవం ఎక్కుపెడితే, ఆధునిక మహాభారతంలో మన శేషేంద్రుడు కలాన్ని ఎక్కుపెట్టాడు. కవి తన కవిత్వం ద్వారా కాంక్షించేది మానవ చైతన్యమే! మనిషిని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకు వెళ్ళడమే కవిత్వ పరమావధి. కవిత్వం చదివాక మొక్కలాంటి మనిషి మహావృక్షంగా విస్తరించాలి. విరబూయాలి. కోటి గొంతుల్లో పాటగా పరిమళించాలి. సరికొత్త బాటలో నడకను ప్రారంభించాలి. డాక్టర్ శేషేంద్రశర్మగారు "ఆధునిక మహేతిహాసం"గా అభివర్ణించిన 'ఆధునిక మహాభారతం'లో మూల సత్యం ఇదే! కవిత్వంలో ప్రధానమైనవి సామాజిక స్పృహ–సాహిత్య స్పృహ. సాహిత్యస్పృహ లేని సామాజిక స్పృహ వ్యర్థమంటాడు శేషేంద్ర. వస్తువు, ప్రక్రియ, అభివ్యక్తిని బట్టి కావ్యం స్థాయిని నిర్ణయించాలనే శేషేంద్ర, పై మూడింటి త్రివేణి సంగమంగా జాతికి అందించిన కానుక 'ఆధునిక మహాభారతం' అనే మహా కావ్యం.

> ***నెల్లూరులో పెరిగినవాడు శేషేంద్రశర్మ. నెల్లూరులో తిరిగినవాడు పవన్‌కళ్యాణ్. భావితరానికి సందేశాత్మక భావజాలాన్ని అందించినవారొకరైతే, నాటి ఆయన ఆశయాలను నేటితరానికి అప్పజెప్తూ, భావిభారత పౌరుల బాధ్యతలను గుర్తుచేస్తున్న జనసారథి మరొకరు. నాటి తరానికీ–నేటి తరానికీ మధ్య ఈ 'ఆధునిక మహాభారతం' వారధి కావడం ఎంతైనా విశేషం.***

***"సముద్రం ఒకడి కాళ్ళదగ్గర కూచోని మొరగదు***
***తుఫాను గొంతు చిత్తం అనడం ఎరగదు***
***పర్వతం ఎవడికీ వంగి సలాం చేయదు***
***నేనంతా ఒక పిడికెడు మట్టే కావచ్చు***
***కానీ మొలకెత్తితే నాకు***
***ఒక దేశపు జెండాకున్నంత పొగరు వుంటుంది"***

–– అనే పాదాల్ని తన గుండె నినాదంగా చెప్పే పవన్‌కళ్యాణ్ 'ఆధునిక మహాభారతాన్ని' పునర్ముద్రించి తెలుగుజాతికి కానుకగా ఇచ్చారు. జెండా దేశప్రజల గుండె. జెండాను చూడగానే మనలో ఆత్మవిశ్వాసం, దేశభక్తి పొంగిపొర్లాలి. కవి కూడా దేశభక్తుడే. కనుకనే ఎవరికీ సలాం చెయ్యడు. "ఆధునిక మహాభారతం" చదివితే గులాం మనస్తత్వం కారణంగా వంగిపోయిన మోకాళ్ళకు బలం వస్తుంది. వెన్నెముక ఇనుపచువ్వలా నిలుస్తుంది. మనిషి మనీషిగా మారతాడు. భూ గోళానికి ఇరుసు అవుతాడు"–– అన్న శేషేంద్ర మాటలు అత్యుక్తులు కాదు.. అక్షర సత్యాలు. మహాకవి శేషేంద్ర అనన్యసామాన్యమైన శబ్ద సృష్టితో ఈ శతాబ్దాన్ని వెలిగించారు. మండే సూర్యుడై కొత్త వెలుగునిచ్చారు. రుతుఘోషను వినిపించారు. యుగ స్వభావాన్ని తన కవిత్వంలో ప్రతిఫలింపజేసి "యుగకవి"గా నిలిచారు.

***"రైతులారా! రాజకీయ వర్షం పడుతుంది***
***మోసపోయి విత్తనాలు చల్లకండి"***

–– అంటూ రైతు గొంతుతో కవిత్వం రాసిన శేషేంద్ర అసలైన రైతుకవి.

శేషేంద్ర కవిత్వం మెదడుతో కాక హృదయంతో చదవాలి. వస్తువుతో మమేకం కావాలి. కవి అంతరంగంలోకి తొంగిచూడాలి. అప్పుడు శేషేంద్ర శబ్దజాలంలోని ఇంద్రజాలం తెలుస్తుంది.

***"నదులు, కవులు భూగోళపు రక్తనాళాలు"***

–– అంటారొకచోట!

***"చెట్టయివుంటే..ఏడాదికి ఒక వసంతమన్నా దక్కేది, మనిషినై అన్ని వసంతాలు కోల్పోయాను"***

––అంటారు మరోచోట!

శేషేంద్ర జన్మత: కవి. ఇమిటేషన్ కవి కాదు. ఇమేజరీ కవి. కవిత్వం జరీపోగుల్ని అందంగా నేయగల కవి. వర్తమాన సాహిత్యంలో శేషేంద్ర స్థానం హిమశిఖరం. కానీ, జ్ఞానపీఠాలు దక్కలేదు. లక్షలాది హృదయపీఠాలు దక్కాయి. వర్తమానంలో బతుకుతూ, గతం గొప్పదనే కవులకు శేషేంద్ర సృష్టించిన సరికొత్త శాబ్దిక, భావగర్భిత పదచిత్ర ప్రపంచం అర్థం కాదు. శేషేంద్ర కవిత్వంలోని సౌందర్యం, శైలి, శిల్పం తెలియాలంటే తిలక్ కళ్ళతో చూడాలి. రసదృష్టితో చదవాలి. శేషేంద్ర సమకాలీన ఉద్యమాలకు, వాదాలకు, ఇజాలకు మద్దతు ఇవ్వక పోయినప్పటికీ, ఈ తరం కవుల సమిష్టి గొంతుక శేషేంద్రదే.

***"గడచిన చరిత్రలో నాకు తావు లేదు***
***ఇపుడు నడిచే చరిత్రకు నీతి లేదు"***

–– అన్న శేషేంద్ర మాటలు ఆయన అంతరంగ ఘోషకు భాష్యాలు. ఎవరూ శేషేంద్రను 'మహాకవి'ని చేయనక్కర్లేదు. ప్రజాహృదయ పీఠాలపై ఆయన మహాకవి స్థానం శాశ్వతమైంది. కాలం ఏదైనా కవి చేయాల్సిన పని ఒక్కటే. కలాన్ని పదునెక్కించి కాలం వెంట నడవడమే!.. కవిత్వంగా బతకడమే!

కవిత్వమే మానవుడి శాశ్వత చిరునామా!
కవిత్వమే శేషేంద్ర శాశ్వత వీలునామా!!

***"నీలో సాహసం వుంటే ఈ దేశలో అంధకారం వుంటుందా?"*** ––అన్న శేషేంద్ర ప్రశ్నను "జనసేన" కార్యాచరణకు ప్రేరణగా స్వీకరించి, ఈ ఆధునిక ఇతిహాసాన్ని అందంగా ముద్రించి అందరికీ అందుబాటులోకి తెచ్చిన "జనసేనాధిపతి" పవన్‌కళ్యాణ్ అభినందనీయులు.



## రామాయపట్నం పోర్టుపై...
# వెంకయ్య సహకారం కోరిన ప్రతాప్!

రామాయపట్నంలో పోర్టు, షిప్‌యార్డ్ నిర్మించాలని కోరుతూ కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి 28వ తేదీ ఢిల్లీలో కేంద్రమంత్రి యం.వెంకయ్య నాయుడుని కలిసి విన్నవించారు. పోర్టు వస్తే కావలి పట్టణంతో పాటు ప్రకాశం, నెల్లూరుజిల్లాలోని వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని వివరించారు. ఇఫ్కో కిసాన్‌సెజ్‌లు మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని, స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని, కావలి మున్సిపాలిటీకి మరిన్ని నిధులు విడుదల చేయాలని ఆయన వెంకయ్యను కోరారు. ప్రతాప్ ఈ సబ్జెక్ట్‌ను వివరిస్తున్న సమయంలో అక్కడేవున్న గత నెల్లూరుజిల్లా కలెక్టర్, ప్రస్తుత వెంకయ్య వ్యక్తిగత కార్యదర్శి ఎం.జానకి కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు.

## నిధుల కేటాయింపులో...
# కక్షపై... దీక్ష



అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల కేటాయింపుల్లో నెల్లూరు నగర నియోజకవర్గాన్ని చిన్నచూపు చూస్తుండడంపై ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్‌కు మండింది. వివక్షకు నిరసనగా ఆయన నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో 28, 29తేదీలలో రెండురోజుల పాటు నిరాహారదీక్ష చేశారు. జిల్లాలో వున్న ఏకైక బి.సి ఎమ్మెల్యే ఆయన. వయసులో చిన్నోడు కూడా! ఎలాంటి వ్యాపారాలు, పారిశ్రామిక సంస్థలు, కాంట్రాక్టులు లేవు. నిద్ర లేచింది మొదలు జనం మధ్యలోకి వెళుతుంటాడు. నియోజక వర్గాల వారీగా కేటాయిస్తున్న పింఛన్‌లు, రేషన్‌కార్డులు, ఇళ్ల మంజూరులో నగర నియోజకవర్గాన్ని చిన్నబుచ్చుతున్నారు. అధికారపార్టీ మరియు అధికారుల వివక్షపై దండెత్తుతూ ఆయన ఈ దీక్ష చేపట్టారు. 28వ తేదీ గాంధీబొమ్మ సెంటర్‌లో గాంధీజీ, వై.యస్. విగ్రహాల వద్ద నివాళులర్పించిన అనంతరం ఆయన తనకిష్టమైన నల్లదుస్తులు వేసుకుని నిరాహారదీక్షకు దిగారు. నగరంలోని పలు డివిజన్‌ల నుండి వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీగా ఆయన దీక్షకు మద్దతు ప్రకటించారు. వివిధ మతాల పెద్దలు ప్రార్థనలు నిర్వహించి, అనిల్‌కు ఆశీస్సులందజేశారు.

నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డి, పార్టీ సిఇసి సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, గూడూరు ఇన్‌ఛార్జ్ మేరిగ మురళీధర్, నెల్లూరు డిప్యూటీ మేయర్ యం.ద్వారకానాథ్, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, వైకాపా నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సిపిఐ రాష్ట్ర నాయకులు పమూజుల దశరథరామయ్య అనిల్‌కు సంఘీభావం ప్రకటించారు. 29వ తేదీ సాయంత్రం అనిల్ దీక్షను విరమించారు.

# పెరుగుకు చెక్‌రిపబ్లిక్‌లో డి.లిట్ ప్రదానం



తూర్పు యూరప్‌లోని చెక్ రిపబ్లిక్ రాజధాని నగరం ప్రాగ్‌లో ఈ నెల 15 నుండి 20వరకు జరిగిన 36వ వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ పొయెట్స్ కార్యక్రమంకు భారతదేశం నుండి 5మంది ఆహ్వానిత కవులు హాజరుకాగా, ఆంధ్ర ప్రదేశ్ నుండి నెల్లూరీయుడు పెరుగు రామకృష్ణ హాజరయ్యారు. విశ్వవేదికపై తెలుగువాణిని వినిపించారు. వరల్డ్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కల్చర్, చెక్‌పెన్ ఇంటర్నేషనల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కవుల పండుగలో పలుదేశాలకు చెందిన 160మంది కవులు పాల్గొని కవితా గానాలు, గోష్ఠులు, చర్చలు జరిపారు. ప్రాగ్ నగరంలోని మునిసిపల్ హాలులో జరిగిన కాంగ్రెస్ ప్రారంభ సదస్సుకు ముఖ్యఅతిథిగా మలేసియాలోని పెరాక్ రాష్ట్ర ముఖ్యమంత్రి డా॥ అబ్దుల్ ఖాదిర్ జాంబ్రి, నోబెల్ బహుమతి గ్రహీత ప్రసిద్ధ స్పానిష్‌కవి డా॥ ఎర్నెస్టో కహాన్, మెక్సికో కవయిత్రి మారు, చెక్ కవి వరల్డ్ కాంగ్రెస్ అధ్యక్షులు డా॥ జి.వి.దెడెక్‌లు ప్రసంగించి ప్రపంచ శాంతికి అడ్డుపడుతున్న ఉగ్రవాదాన్ని నిరసించారు. ఈ సందర్భంగా అరుగురు జ్యూరీ ఎంపిక చేసిన ప్రపంచకవులకు గౌరవ డి.లిట్‌లు ప్రదానం చేశారు. వీరిలో భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ నుండి హాజరైన 6మందిలో పిన్నవయస్సు గల పెరుగు రామకృష్ణ తెలుగు కవికి ఈ గౌరవం దక్కడం పట్ల పలువురు ప్రశంసలు కురిపించారు.

# అపోలో హార్ట్‌డే ర్యాలీ



ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో 29వ తేదీ గుండె జబ్బులపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. శాసనమండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై ప్రతి ఒక్కరూ గుండెజబ్బుల బారిన పడకుండా డాక్టర్ల సలహాలు పాటించాలన్నారు. హాస్పిటల్ ఇంట్రావెన్షియల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి గుండెజబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ యూనిట్ హెడ్ నవీన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్వేత, రోటరీ, లయన్స్, పినాకిని క్లబ్ సభ్యులు, గోల్డ్ మర్చంట్స్, జైన్స్, రిటైర్డ్ షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# శక్తికి మించి పనిచేస్తున్నా!



ఒక్క రూపాయి ఎమ్మెల్యే గ్రాంటు రాకపోయినా తన శక్తికి మించి అందరి సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. 28వ తేదీ నెల్లూరురూరల్ మాదరాజుగూడూరులో ఎన్‌సిసి పవర్ ప్లాంట్ మరియు ఎంపి నిధులతో ఏర్పాటు చేసిన రెండు వాటర్‌ప్లాంట్‌లను ఆయన స్థానికుల చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. రాజకీయాలకతీతంగా అందరినీ కలుపుకుని, అందరి సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా ఇక్కడ ఆర్‌ఓ ప్లాంట్‌లను పర్యవేక్షించిన నందిగం వంశీకృష్ణను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు, పిఏసిఎస్ ఛైర్మెన్ ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అనపల్లి కన్వెన్షన్ సెంటర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ పరిచయవర్గ సదస్సు

అక్టోబర్ 1, 2 తేదీలలో నెల్లూరుజిల్లా కోవూరు సమీపంలోని అనపల్లి కన్వెన్షన్ సెంటర్‌లో రాష్ట్ర స్థాయి ఆర్‌ఎస్‌ఎస్ పరిచయవర్గ సదస్సు నిర్వహిస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అఖిలభారత ఉపాధ్యక్షులు దత్తాత్రేయ హోసుబలే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గంతో పాటు రాష్ట్రంలోని 13జిల్లాలకు చెందిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌తో అనుబంధంగా ఉండే వివిధ క్షేత్రాలైన ఏబివిపి, బీజేపీ, బిఎంఎస్, యువజన మోర్చా వంటి అనుబంధ సంస్థల్లో కొత్తగా చేరిన కార్యకర్తలకు ఆర్‌ఎస్‌ఎస్ కార్య వర్గాన్ని, సిద్ధాంతాలను ఈ సదస్సు ద్వారా పరిచయం చేస్తారు. దాదాపు ఈ సదస్సుకు భారీగానే కార్యకర్తలు రావచ్చని అంచనా!

ఈ నెల 28తేదీన గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన జాషువా జయంతి సభలో 'జాషువా సాహిత్య సేవా పురస్కారం' అందుకుంటున్న నెల్లూరుకు చెందిన కవి గుండాల నరేంద్రబాబు



# ఇస్కాన్ భోజనానికి వాకర్స్ చేయూత



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భోజన పథకం నిర్వహిస్తున్న నెల్లూరులోని ఇస్కాన్‌కు ఏ.సి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ 10వేల రూపాయలు విరాళం అందించింది. మంగళవారం స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులకు ఈ విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వేలూరు రంగారావు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, మాజీఅధ్యక్షులు ఎస్.రాఘవేంద్రషెట్టి, ఉపాధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు, బాసం శేషగిరిరావు, డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర్ దొరస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.




**శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానము**

దుర్గామిట్ట, నెల్లూరు - 4. ఫోన్: 2322016

**42వ శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవ సమాహ్వానము**

మహాభిషేకం తేది 11-10-2016 వేకువన 4-00 గంటలకు

తేది 01-10-2016 నుండి తేది 11-10-2016 వరకు

**ఉత్సవ కార్యక్రమములు**

| | | | | | |
|---|---|---|---|---|---|
| తేది.01-10-16 | శనివారము | శ్రీ చండీ అలంకారము | తేది.08-10-16 | శనివారము | శ్రీ సరస్వతీ అలంకారము |
| తేది.02-10-16 | ఆదివారము | శ్రీ భవాని అలంకారము | తేది.09-10-16 | ఆదివారము | శ్రీ దుర్గా అలంకారము |
| తేది.03-10-16 | సోమవారము | శ్రీ గాయత్రి అలంకారము | తేది.10-10-16 | సోమవారము | శ్రీ మహిషాసుర మర్దిని |
| తేది.04-10-16 | మంగళవారము | శ్రీ అన్నపూర్ణ అలంకారము | తేది.11-10-16 | మంగళవారము | శ్రీ రాజరాజేశ్వరి అలంకారము |
| తేది.05-10-16 | బుధవారము | శ్రీ గజలక్ష్మి అలంకారము | | | శమీపూజ, పారువేట, నగరోత్సవం |
| తేది.06-10-16 | గురువారము | శ్రీ మహాలక్ష్మి అలంకారము | తేది.12-10-16 | బుధవారము | మధ్యాహ్నం 12గంటలకు |
| తేది.07-10-16 | శుక్రవారము | శ్రీ కాళిక అలంకారము | | | శ్రీ అమ్మవారి సన్నిధిలో అన్నదానం |

శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవములు ఆలయ ప్రధానార్చకులు శ్రీ తంగిరాల రాధాకృష్ణశర్మ, అర్చకులు మరియు సిబ్బంది యొక్క సహాయసహకారములతో నిర్వహించబడును.

**రత్నం జయరామ్**, వ్యవస్థాపక ధర్మకర్త

**పి.కోదండరామిరెడ్డి**, సహాయ కమీషనరు మరియు కార్యనిర్వాహణాధికారి

## 'ప్రభా'తం

# ఆకాశంలో 'అష్ట'గ్రహాలు



ఒకే రాకెట్‌తో రెండు విభిన్నమైన కక్ష్యల్లోకి ఉప గ్రహాలను పంపి ఇస్రో మరో ఘనమైన విజయం సాధించింది. ఎంతో కష్టసాధ్యము.. క్లిష్టసాధ్యమైన ఈ ప్రయోగంలోనూ ఇస్రో అపూర్వమైన విజయం సాధించి అంతరిక్ష రంగంలో భారత్ కీర్తిప్రతిష్టలను రెపరెప లాడించింది. ఇస్రో ఇలాగే మరెన్నో నూతన ప్రయోగా లను అద్భుతంగా ఆవిష్కరించి రోదసి రంగంలో అమేయమైనకీర్తితో వర్థిల్లాలన్నదే ప్రజలందరి ఆకాంక్ష. ఆ కలలను సాకారం చేస్తున్న ఇస్రోకి.. శాస్త్రవేత్తలందరికీ శుభాభినందనలు.

ఒకే రాకెట్.. అందులో 8 ఉపగ్రహాలు. ఆ ఉపగ్రహాలు ఒక కక్ష్యలో కొన్ని ఒకచోట, మరికొన్ని మరోచోట దిగాలి. రెండు భిన్నమైన కక్ష్యల్లో ఆ ఉపగ్రహాలు చేరాలి. అదీ ఒకే ప్రయోగంలో జరగడమంటే చిన్న విషయమేమీ కాదు. అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో, విశేష అనుభవంతో మన శాస్త్రవేత్తలు అంతటి క్లిష్టమైన ప్రయోగాన్ని కూడా అలవోకగా సాధించి, జంట కక్ష్యల ప్రయోగంలోనూ జయకేతనం ఎగురవేశారు. ఒకే పిఎస్ఎల్‌వి రాకెట్ ద్వారా రెండు విభిన్నమైన కక్ష్యల్లో ఉపగ్రహాలను విజయవంతంగా చేర్చిన అరుదైన ఘనతను భారత శాస్త్రవేత్తలు సాధించారు. ఈ ప్రయోగ విజయంతో శాస్త్రవేత్తలతో పాటు భారత ప్రజల ఆనందం మిన్నుముట్టింది.

ఇస్రో వినూత్నంగా చేపట్టిన ఈ ప్రయోగం అపూర్వమైన విజయం సాధించడం అంతరిక్షరంగంలో భారత్ మరో అరుదైన విజయాన్ని కైవశం చేసుకున్నట్లయింది. భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని సతీశ్‌ధవన్ స్పేస్ సెంటర్ నుంచి ఈ నెల 26వ తేది ఉదయం 9.12 గంటలకు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సి-35 నింగిలోకి దూసుకువెళ్ళి అద్భుత విజయాన్ని సాధించింది. ముందెన్నడూ కనీవినీ ఎరుగని విధంగా ఏకంగా ఎనిమిది ఉపగ్రహాలను ఈ రాకెట్ నింగిలోకి తీసుకువెళ్ళింది. ఇందులో మన దేశానికి చెందిన స్కాట్‌శాట్-1, అల్జీరియాకు చెందిన 3 ఉపగ్రహాలు, కెనడా-అమెరికాలకు చెందిన ఒక్కో ఉపగ్రహం, ముంబై ఐఐటి కళాశాలకు చెందిన ఒక ఉపగ్రహం (ప్రథమ్), బెంగుళూరులోని పిఇఎస్ విశ్వవిద్యాలయానికి చెందిన ఉపగ్రహం (పి-శాట్) వున్నాయి. మొత్తం 665.25 కిలోల బరువున్న ఈ ఎనిమిది ఉపగ్రహాలను పిఎస్ఎల్‌వి రోదసిలోకి మోసుకెళ్ళి నిర్ధేశిత కక్ష్యల్లో విజయవంతంగా విడిచి పెట్టడం ఎంతైనా గర్వకారణం. స్కాట్‌శాట్-1ని 729 కిలోమీటర్ల ఎత్తులో ధ్రువసూర్య అనువర్తిత కక్ష్యలో ప్రవేశపెట్టడం, మిగిలిన ఉపగ్రహాలను 689 కిలోమీటర్ల దూరంలో పోలార్ కక్ష్యలో ప్రవేశపెట్టడం అనే అద్భుత ప్రయోగం విజయవంతం కావడం మన శాస్త్రవేత్తల మేధాసంపత్తికి నిదర్శనం. ఇందులో మరో విశేషం ఏమిటంటే, మనదేశానికి చెందిన స్కాట్‌శాట్-1 ఉపగ్రహం తుఫాను రాకను ముందుగానే పసిగట్టేస్తుంది. ఈ ఉపగ్రహాన్ని భారత శాస్త్రవేత్తలు తక్కువ వ్యయంతోనే రూపొందించారు. దాదాపు 150 కోట్లు ఖర్చయ్యే ఈ ఉపగ్రహాన్ని మన శాస్త్రవేత్తలు కేవలం 80 కోట్లతోనే తయారుచేశారు. దీని బరువు 371 కిలోలు. అయిదేళ్ళపాటు ఇది అద్భుతమైన సేవలందిస్తుంది. దీనికంటే ముందు పంపిన ఓషన్‌శాట్-1 ఉపగ్రహం సాంకేతికలోపంతో వున్నందువల్ల దానిస్థానంలో ఇప్పుడు స్కాట్‌శాట్-1 పంపారు. తాజాగా పంపిన స్కాట్‌శాట్-1లో మరింత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించారు. ఇందులో అమర్చిన స్కాటరోమీటర్ అనే అధునాతన పరికరం ద్వారా తుఫాన్ ప్రారంభం అవుతున్నప్పటి నుంచి అది బలపడే వరకు, తుఫాన్ ఎక్కడ తీరం దాటుతుందనే సమాచారంతో పాటు, తీరం వద్ద గాలి ఎంత వేగంగా వీస్తుంది.. ఏ దిశలో ఈదురు గాలులు వస్తాయి.. తదితర పూర్తిస్థాయి సమాచారాన్నంతా తెలుసుకునేందుకు వీలుగా ఈ స్కాట్‌శాట్-1ను రూపుదిద్దడం విశేషం. సముద్రాలపై వీచే గాలులను, వచ్చే తుఫాన్లను ఇది ముందుగానే పసిగడుతుంది. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలతో నష్టాలను, కష్టాలను బాగా తగ్గించుకోవచ్చు. రెండు రోజులకోసారి భూమినంతా చుట్టివచ్చే ఈ ఉపగ్రహం వల్ల భూ వాతావరణానికి సంబంధించిన సమస్త సమాచారం అందుబాటులోకి వస్తుంది. అది మనదేశానికే కాక, ఇతర దేశాలకూ ఉపయోగపడుతుంది. ఇస్రో నుంచి అనేక రాకెట్ ప్రయోగాలు జరిగినా, విభిన్నమైన జంటకక్ష్యల్లోనూ ప్రయోగం జరగడం ఇదే తొలిసారి. అయినా విజయం సాధించడం గర్వకారణం. ఇప్పుడే కాదు..2011 నుంచి ఇప్పటిదాకా వరుస విజయాలు ఇస్రో సొంతమవుతూనే వున్నాయి. ఇప్పటిదాకా 96 ఉపగ్రహాలు, 56 రాకెట్ ప్రయోగ విజయాలతో అంతరిక్షశాస్త్ర విజ్ఞానంలో ఇస్రో ఎన్నో మైలురాళ్ళను అధిగమించింది. చేపట్టిన 56 ప్రయోగాల్లో 48 విజయవంతం కాగా, ఇందులో 36 విజయాలు పిఎస్ఎల్‌వి రాకెట్లవే కావడం మరో విశేషం. స్వదేశీ పరిజ్ఞానంతో మొట్టమొదటిసారిగా మన శాస్త్రవేత్తలు రూపొందించిన ఆర్యభట్ట ఉపగ్రహాన్ని 1975 మే 19న రష్యానుంచి ప్రయోగించారు. 1979 జూన్ 7న భాస్కర-1 ఉపగ్రహాన్ని కూడా రష్యా నుంచే ప్రయోగించారు. ఆ తర్వాత శ్రీహరికోటలో రాకెట్‌కేంద్రం ఏర్పాటు కావడంతో 1979 ఆగస్టు 10వ తేదిన ఎస్ఎల్‌వి-3 ఇ-1 రాకెట్‌ను ప్రయోగించారు. అయితే దురదృష్టవశాత్తూ అది సఫలం కాకపోవడంతో, శాస్త్రవేత్తలు మరింత పట్టుదలతో అహర్నిశలు కృషి చేసి, 1980లో ఎస్ఎల్‌వి-3 ఇ2 రాకెట్‌ను దిగ్విజయంగా ప్రయోగించారు. ఇక అప్పటినుంచి శ్రీహరికోట నుంచి ఎన్నో రాకెట్ ప్రయోగాలు జరుగుతూనే వున్నాయి.. ఏ ఒకటో రెండో మినహా మిగిలినవన్నీ ఘన విజయాలే. 1993లో పిఎస్ఎల్‌వి సీరీస్ ప్రారంభమై భారీ రాకెట్ ప్రయోగాలను ప్రారంభించి ఇప్పటిదాకా మొత్తం 37ప్రయోగాలు నిర్వహిస్తే అందులో మొదటిసారి పంపిన రాకెట్ తప్ప మిగిలిన 36 రాకెట్లు విజయవంతమై భారత శాస్త్రవేత్తల శాస్త్రపరిజ్ఞానాన్ని, వారి అకుంఠిత దీక్షాదక్షతలను ప్రపంచానికి చాటాయి. ఇప్పుడు తాజాగా పంపిన జంటకక్ష్యల రాకెట్‌కూడా నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి ఎగిసి గగనతలంలో భారత్ ప్రతిష్టను సగర్వంగా చాటింది. రోదసి పరిజ్ఞానంలో భారత్ తిరుగులేని శక్తిగా రాణించాలన్నదే ప్రజలందరి ఆకాంక్ష. ఆ కలలను సాకారం చేస్తూ.. అంతరిక్షరంగంలో అమేయమైన ప్రజ్ఞాపాటవాలతో దూసుకుపోతున్న ఇస్రో ప్రతిభకు, భారత శాస్త్రవేత్తలందరికీ ఈ సందర్భంగా అభినందనలు..శుభాభినందనలు!..

# నెల్లూరు రచయిత్రికి గురజాడ పురస్కారం



సెప్టెంబర్ 18న హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన గురజాడ ఫౌండేషన్ అమెరికా వారి రాష్ట్ర స్థాయి తెలుగు కవితా పురస్కారం–2016ను నెల్లూరు బాలాజీనగర్‌కి చెందిన కవయిత్రి ములుగు విజయదుర్గ (వినీల) అందుకున్నారు. పురస్కార ప్రధానోత్సవ సభకు ముఖ్యఅతిథిగా హాజరయిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి, విశిష్ఠ అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అధికార భాష సంఘం అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గురజాడ ఫౌండేషన్ అధ్యక్షులు సంటి అనిల్‌కుమార్, మాడిశెట్టి గోపాల్, శ్లిష్టా మాధవి, రెండు తెలుగు రాష్ట్రాల కవులు రచయితలు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్‌లో ప్రథమ చికిత్స, విపత్తులపై శిక్షణ

నెల్లూరు నగరంలోని రెడ్‌క్రాస్‌లో ఆదివారం ప్రథమ చికిత్స విపత్తులపై రెడ్‌క్రాస్ వాలంటీర్లు, యూత్ వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సివిఎన్ భాస్కర్ పాల్గొని మాట్లాడుతూ విపత్తుల సమయంలో యువత ముందుండి తమ సేవలను అందించాలని కోరారు. వరదల సమయంలో యువకుల సేవలను కొనియాడారు. శిక్షణ పొందిన యువత విపత్తు సమయంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేసి వారి ప్రాణాలను కాపాడాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందిన యువకులకు సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. ఎల్.వి.నరసారెడ్డి, డాక్టర్ ఎన్.ప్రభాకర్, సాయికుమార్‌రెడ్డి, డి.సుందర్‌రాజు, లక్ష్మీనంద తదితరులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్‌కు కొత్త కార్యాలయం

నెల్లూరు, రామలింగాపురం వద్దనున్న ఇరిగేషన్ కార్యాలయాన్ని 2కోట్ల రూపాయలతో పునరుద్ధరించనున్నారు. శిథిలావస్థలో వున్న కొన్ని భవనాలను కూల్చి, వాటి స్థానంలో కొత్త భవనాలను కట్టబోతున్నారు. ప్రస్తుతం ఉపయోగిస్తూ, గట్టిగా వున్న కొన్ని గదులను మాత్రం రికార్డ్ రూములుగా వాడుకోనున్నారు.

# బ్రాహ్మణ జనాభా గణన

బ్రాహ్మణులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను చేరువ చేసేందుకు రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నెల్లూరుజిల్లాలోని బ్రాహ్మణ జనాభా వివరాలను సేకరించే గణనను ప్రారంభిస్తున్నట్లు కార్పొరేషన్ సమన్వయకర్త ఉచ్చి భువనేశ్వర ప్రసాద్ తెలిపారు. ఆదివారం నెల్లూరు టివిఎస్ కళ్యాణ సదన్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని బ్రాహ్మణ కుటుంబాలకు చెందిన వారందరూ ఈ సర్వేలో పాల్గొని తమ వివరాలను అందజేయాలన్నారు. జిల్లా మండల, గ్రామస్థాయిలోని బ్రాహ్మణ సంఘాలు సర్వేకి సహకరించాలని కోరారు. ఏపి ఇండస్ట్రియల్ ట్రైనింగ్ కన్సల్‌టెన్సీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 20 బృందాలు గణనను చేస్తాయని తెలిపారు. జిల్లా బ్రాహ్మణ సేవాసంఘాల సమితి కార్యదర్శి ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, న్యాయవాది రంగరాజన్, సావర్కర్, సర్వేసంస్థ ప్రతినిధి కె.కృష్ణప్రసాద్ సమావేశంలో పాల్గొన్నారు.

### నాలుగోసారి వాయిదా పడ్డ

# రెవెన్యూ ఎన్నికలు

నెల్లూరు డివిజన్ రెవెన్యూ ఎన్నికలు మరోసారి వాయిదా పడ్డాయి. నెల్లూరు గ్రామీణ మండలం తహశీల్దారు కార్యాలయంలో ఆదివారం జరగాల్సిన నామినేషన్ల ప్రక్రియ అనివార్య కారణాల వల్ల ఆగిపోయింది. గతంలో కూడా ఎన్నికలు వాయిదా వేసినట్లు అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికి నాలుగుసార్లు ఈ ఎన్నికలను వాయిదా వేయడంతో అసంతృప్తి నెలకొందన్నారు.

# దేశద్రోహులను ఉరితీయాలి!

ఓ పక్క దేశ రక్షణ కోసం వీరజవాన్‌లు ప్రాణాలు కోల్పోతుంటే మరోపక్క కొందరు దేశద్రోహులు జవాన్‌లను కించపరిచే వ్యాఖ్యలు చేస్తున్నారు. చదువు వంటబట్టని వాళ్లే సైనికుల్లో చేరుతారంటూ వామపక్ష విద్యార్థి నాయకుడు కన్నయ్యకుమార్ వంటి కుక్కలు వాగుతున్నాయి. ఇలాంటి వారిని దేశం ఎందుకు భరించాలి. ఇలాంటి పాపాత్ములను నిలువునా ఉరితీయాలి.

**సి.రాజీవి, నెల్లూరు.**

# ఇదేం పైత్యం!




పట్టిసీమ కాలువను పట్టిసీమ నదిగా పిలవాలంటూ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. పిచ్చి ముదిరితే తలకు రోకలిని చుట్టమన్నట్లుగా వుంది ఆయన పరిస్థితి. సాగునీటి పారుదల కోసం తవ్విన కాలువకు నది అని పేరు పెట్టడమేమిటి? ఆయన పైత్యం మోతాదుకు మించి పోయింది. ఈ భూమిపై సహజసిద్ధంగా ఏర్పడి ప్రవహించే వాటిని నదులు, వాగులు, వంకలు అన్నారు. సహజసిద్ధంగా ఏర్పడిన స్థిరమైన జలకేంద్రాలను సరస్సులు, సముద్రాలు అంటారు. మానవ నిర్మితమైన వాటిని చెరువులు, రిజర్వాయర్‌లు, కాలువలు అంటారు. చంద్రబాబు పోకడలన్నీ ప్రకృతికి విరుద్ధంగా ఉంటున్నాయి.

**బాపన నారాయణ, రేపల్లె.**

# చెరువులు, కాలువలను కాపాడండి!

పట్టణీకరణ మాటున చెరువులు, కాలువలు మాయమవుతున్నాయి. స్థలాల ధరలు పెరగడం కాలువలకు, చెరువులకు శాపమైంది. హైదరాబాద్‌లో పరిస్థితులే ఇందుకు ఉదాహరణ. హైదరాబాద్, నిజాంపేటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో కోటి రూపాయలపైనే విలువ చేసే ఫ్లాట్ కొని అక్కడ నివాసముంటున్నాను. మేముంటున్న అపార్ట్‌మెంట్స్ కూడా కాలువను ఆక్రమించి కట్టారన్న విషయం ఇప్పుడు వర్షాలకు తెలిసింది. నాలుగు రోజులుగా అపార్ట్‌మెంట్ దిగలేని పరిస్థితి. క్రింద సెల్లార్ పూర్తిగా మునిగిపోయింది. కార్లు మునిగిపోయాయి. కాలువలను, చెరువులను కబ్జా చేసి రియల్టర్లు అపార్ట్‌మెంట్లు కట్టారు. అధికారులు లంచాలు మింగి గుడ్డిగా ప్లాన్‌లు అప్రూవల్ ఇచ్చారు. కాని వాటిని కొన్న మాలాంటి వాళ్లు నష్టపోయారు.

**జె.సుధాకర్, హైదరాబాద్.**

## పెరిగిన పెట్టుబడి... తగ్గిన దిగుబడి



# మీనాక్షీ... ముంచావే!

అన్నదాత... దేశానికి వెన్నెముక. ఈ వ్యాఖ్యల్ని ఏ మహానుభావుడు చెప్పాడోగాని, ప్రతి సందర్భంలోనూ ఆ వెన్నెముకను విరగ్గొడుతూనే వున్నారు. ఈ మానవ ప్రపంచాన్నంతా భరించేది భూమి అయితే, ఈ భూమ్మీద జరిగే మోసాలను భరించే వాడు రైతు. కాబట్టే భూమికి, ఆ భూమిని నమ్ముకున్న రైతుకు ఓర్పు ఎక్కువ! ఈ దేశంలో అధికశాతం మంది.. రైతులు పండించే పంటల మీదనో, లేదంటే వారిని మోసం చేయడం ద్వారానో బ్రతుకుతున్నవారే! రైతుకు ఎదుటివారిని మోసం చేయాలని, కుంభకోణాలు చేయాలని, కోట్లు కొల్లగొట్టాలన్న ఆశ వుండదు. అతనికి వున్న ఆశల్లా మూడుపుట్లు పండే పొలంలో ఇంకో పుట్టి అదనంగా పండితే కనీసం పెట్టుబడి, వడ్డీలన్నా చేతికొస్తాయన్నదే...! కాని రైతన్నలకు ఈ చిన్న ఆశ కూడా నెరవేరడం లేదు. ఇలాంటి రైతుల చిన్నచిన్న ఆశలనే ఆసరాగా చేసుకుని కొందరు స్వార్ధపరులు కోట్లు గడిస్తున్నారు. తమ స్వార్ధం కోసం రైతులను నిలువునా ముంచుతున్నారు.

- రైతులను మోసం చేసిన డీలర్లు
- పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు

రైతులను నట్టేట ముంచిన సంఘటనే ఈ సంవత్సరం నెల్లూరు జిల్లాలో చోటు చేసుకుంది. ఈ జిల్లాలో మొలగొలుకులు, కొన్ని రకాల జిలకర మసూరి బాగా పండుతాయి. అయితే ఈ సంవత్సరం కొత్తగా కొందరు డీలర్లు మీనాక్షి, 555 అనే రెండు నంద్యాల మసూరి రకాల విత్తనాలను జిల్లాలోకి తెచ్చారు. కిలో 700 నుండి 850 రూపాయల వరకు రైతుల నెత్తిన పెట్టారు. ఈ జిల్లాలోని నేలలకు ఇవి అనువైన వంగడాలు కావు. కాని ఈ వంగడాలతో ఎకరాకు 5పుట్లు దాకా దిగుబడి వస్తుందని రైతులను నమ్మించారు. కర్నూలు జిల్లా నుండి చాలా సలీసుగా ఈ విత్తనాలను తెచ్చి ఇక్కడ రైతులకు మాత్రం అధిక ధరలకు కట్టబెట్టారు. అదీగాక నాలుగు నెలల్లోనే పంట చేతికొస్తుందని నమ్మించారు. డీలర్ల మాటలు నమ్మి జిల్లాలోని నెల్లూరు రూరల్, అల్లూరు, విడవలూరు, కొడవలూరు, కావలి, బుచ్చిరెడ్డిపాలెం మండలాలలో 12వేల ఎకరాలలో ఈ వంగడాలలో పైర్లు వేసారు. నెల్లూరురూరల్ పరిధిలోనే అక్కచెరువు పాడు, వావిలేటిపాడు, మాదరాజుగూడూరు, గుండ్లపాలెం, (మిగతా 11వ పేజీలో)



# ఎయిర్‌పోర్ట్‌కు పచ్చజెండా!

- దామవరం విమానాశ్రయంలో కదలిక

గత పదేళ్లుగా ముందుకు మూడడుగులు పడితే వెనక్కి నాలుగడుగులు పడుతున్న దగదర్తి విమానాశ్రయ అంకం ఎట్టకేలకు ముందుకు కదిలింది. రాష్ట్రంలో నిర్మించ తలపెట్టిన మూడు విమానాశ్రయాలు భోగాపురం(విజయనగరం), ఓర్వకల్లు(కర్నూలు), దగదర్తి(నెల్లూరు)లకు కేంద్ర పౌరవిమానయాన శాఖ స్క్రీనింగ్ కమిటీ ఆమోదం తెలిపింది.

నెల్లూరుజిల్లా దగదర్తి మండలంలో దామవరం వద్ద జాతీయ రహదారి వెంబడి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి 1390 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. ఇందులో 840ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో వుంది. ఇక 290 ఎకరాల ప్రైవేట్ భూమిని కూడా సేకరించనున్నారు. 88కోట్ల వ్యయంతో పిపిపి పద్ధతిలో ఈ ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించనున్నారు. రాష్ట్రంలోనే పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతుంది నెల్లూరుజిల్లానే! విశాఖ–చెన్నై, బెంగుళూరు–చెన్నై పారిశ్రామిక కారిడార్‌లు పూర్తయితే నెల్లూరుజిల్లా పారిశ్రామికంగా ఇంకా ముందుకెళుతుంది. ఈ దశలో జిల్లాలో ఎయిర్‌పోర్ట్ ఎంతో అవసరం కావచ్చు. ప్రస్తుతం నెల్లూరు నుండి తిరుపతి, చెన్నైలకు వాహనాలలో వెళ్లి అక్కడనుండి హైదరాబాద్, ఢిల్లీ, కలకత్తా వంటి నగరాలకు వెళుతున్న నెల్లూరీయుల సంఖ్య భారీగానే వుంది. తిరుపతి, హైదరాబాద్‌ల మధ్య తిరిగే విమానాలలో సగం మంది నెల్లూరోళ్లే కనిపిస్తుంటారు. ఇక కృష్ణపట్నం పోర్టు, శ్రీసిటీ, మేనకూరు సెజ్‌లకు పారిశ్రామిక వేత్తలు, వివిధ కంపెనీ ప్రతినిధులు రాక పోకలు సాగిస్తుంటారు. దగదర్తి ఎయిర్ పోర్ట్ పూర్తయితే వీరందరికీ ఎంతో అనుకూలంగా వుంటుంది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


## రెండు టీడీపీకి... ఒకటి వైసిపికి

### విజయ డెయిరీ ఎన్నికల్లో విజేతలు





సెప్టెంబర్ 26వ తేదీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన విజయ డెయిరీ డైరక్టర్ల ఎన్నికల్లో రెండు డైరక్టర్ల పదవులను అధికార పార్టీ తెలుగుదేశం దక్కించుకోగా, ఒక డైరక్టర్ పదవిని వైకాపా గెలుచుకుంది. వైకాపా తరఫున పోట్లపూడి సహకార సొసైటీ నుండి పోటీకి దిగిన చిల్లకూరు సుధీర్‌రెడ్డి 86ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. ఈయనను ఓడించడానికి అధికారపార్టీ నేతలు చేసిన ప్రయత్నాలన్నీ కూడా విఫలమయ్యాయి. ఇక తెలుగుదేశం తరఫున నార్త్‌రాజుపాలెం సొసైటీ నుండి పోటీ చేసిన ఇరువూరు వెంకురెడ్డి 73ఓట్లతో, పొంగూరుకండ్రిక సొసైటీ నుండి పోటీ చేసిన తలచీరు సుబ్బరాయుడు 73ఓట్లతో విజయం సాధించారు. మొత్తం మూడు డైరక్టర్ పదవులకు నలుగురు పోటీ పడగా కలికి వేణుగోపాలరెడ్డి 66ఓట్లతో ఓటమి పాలయ్యాడు. విజయ డెయిరీ పాలక వర్గంలో 14మంది డైరక్టర్లు ఉండగా వారిలో 13మంది తెలుగుదేశం వారే! ఇప్పుడు చిల్లకూరు సుధీర్‌రెడ్డి గెలుపుతో వైకాపా బోణీ చేసినట్లయ్యింది.



## కౌన్సిల్ సమావేశాలంటే...
# భయపడుతున్న మేయర్!



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొక్కుబడిగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లే, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ కూడా మొక్కుబడిగా కౌన్సిల్ సమావేశాలు పెడుతున్నాడు. కౌన్సిల్ సమావేశాలు పెడితే ఆయనను ఉతికి ఆరేయాలని ప్రతిపక్ష కౌన్సిలర్లు కాచుక్కూర్చున్నారు. తనకు కావాల్సిన పనులను ఆయన స్టాండింగ్ కమిటి సమావేశంలో ఆమోదింప చేసుకుంటూ కౌన్సిల్ సమావేశాల జోలికి పోవడంలేదు. మూడు నెలలకోసారి పెట్టాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని కనీసం ఆరు నెలలకోసారి కూడా జరపకపోతుండడంతో కార్పొరేటర్లు ఆయనపై తీవ్ర అసహనంతో ఉన్నారు. తమ డివిజన్‌లలోని సమస్యలను కౌన్సిల్‌లో ప్రస్తావించి తమకు ఓట్లేసిన ప్రజల ముందు పనిచేస్తున్నట్లు కలరింగ్ ఇవ్వాలన్నది కొందరి కార్పొరేటర్ల తపన. కొందరైతే సమస్యలను నిజంగానే సమావేశంలో చర్చించాలనుకుంటున్నా, మేయర్ అవకాశమివ్వడం లేదు. ఎమ్మెల్యే అనే ఫీలింగ్ రావాలంటే అసెంబ్లీలో మైకు పట్టుకుని 'అధ్యక్షా!' అని పిలవాలి. కౌన్సిల్‌లో కూడా అంతే... కార్పొరేటర్ తన పదవిని ఎంజాయ్ చేసేది కూడా కౌన్సిల్ సమావేశాలలో లేచి సమస్యలను ప్రస్తావించినప్పుడే...! మన మేయర్ మాత్రం కార్పొరేటర్లకు ఆ ఛాన్స్ లేకుండా చేస్తున్నాడు.

## జీవనశైలి మార్పుతో గుండె పదిలం

**- డా॥ చిర్రా భక్తవత్సలరెడ్డి**



మన జీవనశైలిలో మార్పుతో గుండె వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని సింహపురి హాస్పిటల్స్ గుండె వైద్య విభాగాధిపతి డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డి అన్నారు. ఇటీవల సింహపురి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నగరంలోని టౌన్‌హాల్లో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా గుండె వ్యాధులపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుమేహం, రక్తపోటు, మత్తుపానీయాలు, సిగరెట్లు, క్రొవ్వు పదార్థాలు, మానసిక వత్తిడివల్ల, వంశపారంపర్యంగా గుండె జబ్బులు వస్తాయన్నారు. భారతదేశంలో మధుమేహం, సిగరెట్లు త్రాగడం వల్ల ఎక్కువగా మరణిస్తున్నారని, వీరిలో 80 శాతం మంది ధూమపానం వల్లనే మరణిస్తున్నారన్నారు. మధుమేహం అదుపులో లేకపోతే హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు ఎక్కువని అన్నారు. గుండె జబ్బులతో బాధపడేవారు మధుమేహం, రక్తపోటు అదుపులో ఉంచుకోవాలని, మందులు జీవితాంతం వాడాలని, వాడకపోతే మళ్ళీ మళ్ళీ వచ్చే అవకాశం ఉందన్నారు. మాంసం, రొయ్యలు, పెరుగుతో కూడిన పదార్థాలు, నెయ్యితో చేసిన పదార్థాలు వాడకూడదని, నూనె పదార్థాలు తక్కువగా వాడడం మంచిదన్నారు. అనంతరం సదస్సులో పాల్గొన్న ప్రజలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డా.ఎన్. ప్రభాకర్ నాయుడు, సింహపురి హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, డాక్టర్ జి.రామచంద్రా రెడ్డి, సింహపురి హాస్పిటల్స్ వైద్యులు పాల్గొన్నారు.

## చిత్తూరు ఇన్‌ఛార్జ్‌గా వినోద్



చిత్తూరుజిల్లా యువజన కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, నెల్లూరీయుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డిని నియమిస్తూ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ మానస్ మల్లిక్ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు జిల్లాలో యువజన కాంగ్రెస్ కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించనున్నారు.

## నెల్లూరు కబుర్లు

# రొట్టెల పండుగకు పటిష్ఠ భద్రత



నెల్లూరు బారాషాహిద్ దర్గాలో జరుగనున్న రొట్టెల పండుగకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ విశాల్ గున్నీ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 26న ఆయన దర్గాలో రొట్టెలపండుగ ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్గాకు వచ్చే భక్తులు, వారి భద్రత దృష్ట్యా వారికి అందించాల్సిన సేవలపై మేయర్ అబ్దుల్‌అజీజ్‌తో చర్చించారు. గంధమహోత్సవ కార్యక్రమం ప్రారంభమయ్యే ప్రాంతం నుంచి దర్గాకు చేరుకునే ప్రాంతాలను కూడా ఆయన పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా రొట్టెల పండుగ జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు డిఎస్పీలు వెంకటరాముడు, కోటారెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## మూలస్థానేశ్వరస్వామి దేవాలయంలో...
# 1 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

**- ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి వెల్లడి**



నెల్లూరు మూలాపేటలో వెలసివున్న భువనేశ్వరీదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 1 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మెన్ ఆల్తూరి గిరీష్‌రెడ్డి, ఆలయ ఇ.ఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలియజేశారు. అక్టోబర్ 1వ తేది సాయంత్రం 5.30 గంటలకు ఈ ఉత్సవాల ప్రారంభసూచకంగా కలశస్థాపన జరుగుతుందని, రాత్రి ఏడుగంటలకు అమ్మవారికి భవాని అలంకారం నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా 2వ తేదిన ఉదయం 7 గంటలకు నవావరణ పూజ, పుష్పాలంకరణ, 8 గంటలకు చండీహోమం, రాత్రి 7 గంటలకు భువనేశ్వరి అలంకారం వుంటాయని, 3న త్రిపురసుందరి అలంకారం, 4న రాజరాజేశ్వరిదేవి అలంకారాలను కన్నులపండువగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. 5న అన్నపూర్ణాదేవి అలంకారం, 6న చండీ అలంకారం, 7న సరస్వతీదేవి అలంకారం, 8న దుర్గాదేవి అలంకారం, 9న మహిషాసురమర్ధిని అలంకారం, 10వ తేదిన శమీపూజోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు నవావరణ పూజ, పుష్పాలంకరణ, 8 గంటలకు చండీహోమం జరుగుతాయని, భక్తులందరూ ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామివార్ల కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని వారు కోరారు.

## మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో
# అమరవీరులకు నివాళులు



నెల్లూరు మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడుల్లో అశువులు బాసిన అమరవీరులకు ఆదివారం రాత్రి నివాళులర్పించారు. నెల్లూరు విఆర్‌సి సెంటర్ నుంచి గాంధీబొమ్మ వరకు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఆర్ సేవాసమితి వ్యవస్థాపకులు మాగుంట శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన సైనికదళానికి చెందిన కుటుంబాలను చూస్తుంటే ఎంతో బాధ కలుగుతోందన్నారు. వారి కుటుంబాలను కేంద్రప్రభుత్వం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు తమ సేవాసమితి సభ్యులంతా 365రోజులకు రూ.365లు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే తమ కుటుంబంలోని నలుగురు సభ్యులు తరఫున రోజుకు రూపాయి లెక్కన 1450రూపాయలు ఆర్మీ అకౌంట్‌లో జమ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు కమతం అశోక్, సాయిబాబు, ఎం.బాబు, మహేష్, నిషాద్, రహీమ్, చౌదరి పాల్గొన్నారు.

## రత్నం విద్యార్థుల 'దోమలపై దండయాత్ర'




ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపు మేరకు నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని డా॥ కిషోర్స్ రత్నం ఫ్యూచర్ విజన్ స్కూల్ నందు "దోమలపై దండయాత్ర" అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు దోమలు, వాటి వల్ల కలిగే వ్యాధుల మీద ప్రచారం, అవగాహన ర్యాలీని ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే విధంగా నిర్వహించారు.

24వ తేదీ జరిగిన ఈ కార్యక్రమంలో డా॥ కిషోర్స్ రత్నం జెన్‌నెక్ట్స్ స్కూల్స్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, పాఠశాల ప్రిన్సిపల్ కళ్యాణి, మేనేజర్ రాధాకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నెల్లూరు తహశీల్దార్‌గా
# శ్రీనివాస్‌రెడ్డి

నెల్లూరు మండల తహశీల్దార్‌గా శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ నెల్లూరుజిల్లా కలెక్టర్ ముత్యాలరాజు 24వ తేదీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం తహశీల్దార్‌గా వున్న వెంటేశ్వర్లు అనారోగ్య కారణంతో సెలవుపై వెళ్లడంతో కలెక్టర్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. శ్రీనివాస్‌రెడ్డి దుత్తలూరు మండల తహశీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై నెల్లూరు వచ్చారు. అధికారపార్టీ నేతల ఒత్తిడితోనే వెంకటేశ్వర్లు స్థానంలో శ్రీనివాసులరెడ్డిని నియమించినట్లు తెలుస్తోంది.

## వైకాపా నాయకులకు పార్టీ పదవులు

వైకాపా నాయకులకు పార్టీ పదవుల వివరాలను నెల్లూరుజిల్లా వైయస్సార్సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం నెల్లూరుజిల్లా పార్టీ కార్యాలయంలో ప్రకటించారు. యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శిగా సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి, మహిళా కార్యదర్శిగా వేణుంబాక సుజితారెడ్డి, రూరల్ బిసి విభాగం ప్రధానకార్యదర్శిగా వాకా వెంకటేశ్వర్లు, నగర ఉపాధ్యక్షుడిగా బి.కృష్ణ, నెల్లూరు రూరల్ మండల కార్యదర్శిగా ఎం.వేణులను నియమించారు. వీరి పరిచయ కార్యక్రమం అనంతరం వారిని కాకాణితో పాటు నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు సన్మానించారు.

## నెల్లూరును చూడని వాన!

ప్రస్తుతం నెల్లూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో తప్పితే రాష్ట్రంలోని మిగతా అన్ని జిల్లాల్లో వర్షాలు పడుతున్నాయి. నెల్లూరుజిల్లాలో చినుకు జాడ లేదు. ఎండలు కాస్త తగ్గుముఖం పట్టడం సంతోషించాల్సిన విషయం. మనకు చాలావరకు అక్టోబర్, నవంబర్‌లలో వర్షాల సీజన్! ఆ రెండు నెలల్లో వర్షాలు లేకుంటే నీటికి తిప్పలే!

# సామాన్య భక్తుడిలానే దర్శించుకుంటా!

**- కోటంరెడ్డి**



ఈ నెల 26న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా దుర్గామిట్టలోని రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితుల ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాలు రాబోతున్నాయని, రాజరాజేశ్వరి అమ్మవారి గుడి వద్ద హోర్డింగ్స్‌తో, ఫ్లెక్సీలతో ఆధ్యాత్మిక భావన దెబ్బతినకుండా, భక్తుల మనోభావాలు దెబ్బతీయకుండా ఎవరు కూడా రాజకీయ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని కోరారు. గత రెండు సంవత్సరాల క్రితం అందరి సహకారంతో నరసింహకొండ ఉత్సవాలలో ఈ పద్ధతి విజయవంతంగా అమలు చేశామని, అదే పద్ధతిని రాజరాజేశ్వరి గుడి వద్ద కూడా పాటించి పూర్తి ఆధ్యాత్మిక భావన కలిగించాలన్నారు. జిల్లా మంత్రి కూడా ఆమోదించి ఆ రాజకీయ ఫ్లెక్సీలు నిషేధిస్తూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారని, అందరూ కలిసి విజయవంతంగా దీనిని పాటించాలని చెప్పారు. విఐపి దర్శనాల పేరుతో సామాన్య భక్తులకి తీవ్రంగా ఇక్కట్లు ఎదురౌతున్నాయని, చంటి బిడ్డలను చంకన వేసుకుని మహిళలు, వృద్ధులు గంటల కొద్ది క్యూలైన్‌లో వేచి ఉండి, తీరా అమ్మవారి గర్భగుడి వద్దకు వస్తే విఐపి భక్తుల తాకిడితో సామాన్య భక్తులకు అమ్మవారు కనపడే పరిస్థితి లేక తీవ్ర నిరాశకు గురౌతున్నారన్నారు. అందుకే విఐపి దర్శనాలు రద్దు చేయమని రూరల్ నియోజకవర్గంలో అతిపెద్ద ప్రోటోకాల్ ఉన్న తాను సైతం స్థానిక ఎమ్మెల్యేగా ప్రోటోకాల్‌ని వదులుకొని సామాన్య భక్తుల క్యూలైన్‌లోనే అమ్మవారిని దర్శించుకుంటానని, విఐపిలు అందరు కూడా సామాన్య భక్తులకి ఇబ్బంది రాకుండా సహకరించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, కార్పొరేషన్ విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్, చెక్కా సాయి సునీల్, పురుషోత్తం యాదవ్, నరసింహయ్య ముదిరాజ్, ప్రవీణ్, కుమార్, రాజేష్, కుమార్, హరికుమార్, కేశవులు, సురేష్, రమణయ్య, ప్రసాద్, చంద్ర, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు తమ్ముళ్లకు...
# దసరా మామూళ్లు లేనట్లే!





*బండికి ముందు గడ్డి మోపును కడితే... ఎద్దులు ఆ గడ్డిని తినాలన్న ఆత్రుతతో పరుగెడుతుంటాయి. బండి స్పీడ్‌గా ముందుకు పోతుంటుందేగాని ఎద్దులకు మాత్రం ఆ గడ్డి అందదు. బండిని వేగంగా పోనివ్వడానికి, ఎద్దులను పరుగెత్తించడానికి ఇదొక లాజిక్ అన్నమాట! చంద్రబాబునాయుడు నామినేటెడ్ పదవుల విషయంలో ఈ లాజిక్‌ను బాగానే ఫాలో అవుతున్నట్లుగా వుంది.*

2014లో చంద్రబాబు సిఎం అయినప్పటి నుండి ఇప్పటి వరకు రెండు సంక్రాంతులు, రెండు ఉగాదులు, మూడు వినాయక చవితులు, రెండు దీపావళి, రెండు దసరా పండుగలు వచ్చాయి. మూడో దసరా పండుగ కూడా రాబోతోంది. ప్రతి పండక్కి మంత్రి పదవులు ఇస్తారనో, నామినేటెడ్ పదవులను ఇస్తారనో వార్తలు వస్తున్నాయి. ఆ టైంలో తెలుగుతమ్ముళ్లు కోటి ఆశలతో ఎదురుచూస్తుంటారు. యధాఫలంగా పదవుల పందేరం వాయిదా పడుతుంటుంది.

ఈసారి దసరాకు కూడా నామినేటెడ్ పందేరం అన్న ప్రచారం వచ్చింది. జిల్లాలోని తెలుగుతమ్ముళ్లంతా మళ్ళీ ఒకసారి నోర్లు తెరచి ఎదురుచూసారు. కిలారి వెంకటస్వామినాయుడు అన్న ఆశాజీవికి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ పదవిని ఇచ్చారు. ఇక పదవులను ఆశిస్తున్న తమ్ముళ్ల లిస్టు బాగానే వుంది. పార్టీ కోసం చొక్కాలు చించుకుని, సొంత డబ్బులు పోగొట్టుకున్న వారిలో డాక్టర్ జడ్.శివప్రసాద్, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, దేశాయిశెట్టి హనుమంతరావు వంటి వారున్నారు. అలాగే పార్టీని నమ్ముకుని కిందా మీదా పడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అనూరాధ, వేనాటి రామచంద్రారెడ్డి వంటి వారు కూడా నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు. దసరా తర్వాతే నామినేటెడ్ పదవుల పంపకం ఉంటుందని మళ్ళీ వార్త ఒకటి వదిలారు. ఇక నామినేటెడ్ పదవు లిచ్చినా వెలగబెట్టేది గట్టిగా రెండేళ్లే! ఆ తర్వాత ఎలక్షన్‌లు! రాజెవరో...? రైతెవరో...? ఇంకోసారి నామినేటెడ్ పదవుల పంపకం వాయిదా పడితే తమ్ముళ్లు వాటిపై ఆశలని పూర్తిగా వదులుకునే అవకాశముంది.

# నగరం నీట్‌గా ఉండాలి - కలెక్టర్



నెల్లూరు నగర పరిధిలోని సాగునీటి కాలువలు మరియు డ్రైనేజీ కాలువలకు సంబంధించిన పారిశుధ్య కార్యక్రమాల పనులను పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు కార్పొరేషన్ పరిధి లోని నీలగిరిసంఘం, మన్సూర్‌నగర్, గచ్చుకాలువ, జనార్ధన్‌రెడ్డి కాలని మరియు కొత్తూరు, వైయస్సార్‌నగర్ కాలనీలను సందర్శించి అక్కడ పారిశుధ్య కార్యక్రమాల పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో సాగునీటి కాలువలు, డ్రైనేజీ కాలువలకు సంబంధించిన పనులు సమర్ధవంతంగా నిర్వహించి మురుగునీరు నిలవకుండా పరిశుభ్రంగా వుండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వైయస్సార్ నగర్ కాలనీలో అసంపూర్తిగా వున్న గృహనిర్మాణ పనులను నిబంధనల మేరకు పూర్తి చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పెండింగ్‌లో వున్న మౌలిక సదుపాయాల పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట నెల్లూరు నగర కమిషనర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పి.డి. రామచంద్రారెడ్డి, పబ్లిక్ హెల్త్, ఇరిగేషన్ ఇంజనీర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మేకిన్ ఇండియా ప్రతిరూపం... శ్రీసిటి



సత్యనారాయణకు జ్ఞాపికను బహుకరిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

ఆధార్ వ్యవస్థ పర్యవేక్షణ సాధికార సంస్థ యూనిక్ ఐడెంటికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఎఐ) ఛైర్మెన్ జె.సత్య నారాయణ 24వ తేదీ శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, సెజ్‌లో మౌలిక వసతులు, పారిశ్రామిక ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీసిటి ఓ అద్భుతమైన ప్రాజెక్టుగా పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా లక్ష్యాన్ని ప్రతిబింబించేలా ఇక్కడ మంచి వసతులున్నాయని అన్నారు. అతి త్వరలో ఈ ప్రాంతం పూర్తిస్థాయిలో పరిశ్రమలతో నిండి మంచి ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతుందనడంలో సందేహం లేదన్నారు. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ సత్యనారాయణ పర్యటన పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆయనతో తన చిరకాల బంధాన్ని గుర్తు చేసుకున్నారు. 1990 ప్రాంతంలో తాను ఐటి పరిశ్రమలో వున్నప్పుడు, ఆయన ఏపి గవర్నమెంట్ ఉన్నతాధికారిగా పలు ఈ-గవర్నన్స్ ప్రాజెక్టులు సమర్ధవంతంగా అమలు చేశారని తెలిపారు. గతంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార శాఖ (డైటీ) కార్యదర్శిగా పనిచేసిన ఆయన ఎలక్ట్రానిక్ మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్లు(ఈఎంసి) ఏర్పాటు విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారన్నారు. ప్రస్తుతం శ్రీసిటీలో ఐటి, ఎలక్ట్రానిక్ మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్లు అభివృద్ధిపై దృష్టి సారించిన తరుణంలో ఆయన రాక ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

# టిఎన్ఎస్ఎఫ్‌లోకి విద్యార్థులు



వివిధ విద్యార్థి సంఘాలకు చెందిన పలువురు విద్యార్థులు ఆదివారం నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.తిరుమలనాయుడు సమక్షంలో తెలుగునాడు విద్యార్థి సంఘంలో చేరారు. విద్యార్థులందరికీ వివేకా, రవిచంద్రలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంకా ముజీర్ రోజ్‌దార్, శింగంశెట్టి రవిచంద్ర, విశ్వరూపాచారి, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.




### విశ్వసాయి విద్యాసంస్థల

# ప్రతిభా పురస్కార ప్రదానోత్సవం




ప్రపంచాన్ని మార్చే శక్తి చదువుకు మాత్రమే వుందని, క్రమశిక్షణ గల జీవితం విద్యార్థి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుతుందని రీజనల్ జాయింట్ డైరెక్టర్ సి.యస్.పరంధామయ్య అన్నారు. ఆదివారం నెల్లూరులోని పావని గార్డెన్స్ నందు జరిగిన విశ్వసాయి విద్యాసంస్థల ప్రతిభాపురస్కార ప్రదానోత్సవ వేడుకలకు అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎంత నేర్చుకున్నా నిత్యం విద్యార్థిగానే ఉండాలని అంటూ డాక్టర్ అబ్దుల్ కలాం అందించిన పలు సూచనలను సోదాహరణంగా వివరించారు. ఈ విద్యా సంవత్సరం విశ్వసాయి 80 మందికిపైగా విద్యార్థులను డాక్టర్ విద్య చదివేందుకు అర్హత సాధించేలా తీర్చిదిద్దడం గొప్ప విషయమని, రాబోయే విద్యాసంవత్సరం 100మందికిపైగా విద్యార్థులు అర్హత సాధించేలా శిక్షణ ఇచ్చి నెల్లూరులో మెడికల్ కళాశాల స్థాపించాలని ఆయన అభిలషించారు.

ఇంటర్‌మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి బాబు జాకబ్ మాట్లాడుతూ విశ్వసాయి కళాశాల స్థాపించటం నెల్లూరీయుల అదృష్టమంటూ కృషి పట్టుదలతో జీవితం ఆనందమయం చేసుకోవచ్చని, విద్యార్థులు కొత్త ఆలోచనలతో సాంకేతికంగా ఎదుగుతూ దేశాభివృద్ధికి దోహదపడేలా తయారు కావాలన్నారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ దేశానికి ఇద్దరే వీరులు ఉంటారని, ఒకరు డాక్టర్, మరొకరు సైనికుడని... మీరు ఈ ఇద్దరిలో ఎవరో ఒకరు కావాలనికోరుకుంటున్నాని ఆకాంక్షించారు. ముఖ్యఅతిథి ప్రొఫెసర్ కె.సత్యనారాయణరావు మాట్లాడుతూ నేడు దేశం సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిందని, కాని దానిని సన్మార్గంలో ఉపయోగిస్తే భవిష్యత్తు ఎంతో ఎత్తుకు ఎదుగుతుందని ఒక లక్ష్యంతో సమయాన్ని ఉపయోగించుకుంటూ, స్కిల్స్, వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకుంటూ దేశం గర్వించదగ్గ వారుగా మీరందరూ ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమాన్ని కళాశాల ఛైర్మెన్ డాక్టర్ యన్.సత్యనారాయణ, వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్‌లు పర్యవేక్షించగా ప్రిన్సిపాల్ జితేంద్ర, శివశంకర్, శ్రీరామ్‌రెడ్డి, సుబ్బరాయుడులు నిర్వహించారు.

# పనబాక జన్మదిన వేడుకలు




నెల్లూరుజిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డా॥ పనబాక కృష్ణయ్య జన్మదిన వేడుకలు నెల్లూరుజిల్లా ఎన్ఎస్‌యుఐ కమిటీ ఆధ్వర్యంలో 24వ తేదీ ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యుఐ జిల్లా కమిటి ఆధ్వర్యంలో నెల్లూరు బ్లడ్ బ్యాంకు వారి సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ రక్తదాన శిబిరంలో మొత్తం 213 మంది రక్తదాతలు రక్తదానం చేశారు. అనంతరం పి.సి.సి ఉపాధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఎన్ఎస్‌యుఐ ఏర్పాటు చేసిన 25కేజీల భారీ కేక్‌ను కట్ చేసి పనబాక కృష్ణయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు జి.కేశవ నారాయణ, కాంగ్రెస్‌పార్టీ బిసి సెల్ రాష్ట్ర కన్వీనర్ గాలాజు శివాచారి, మైనార్టీ సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఆసిఫ్ పాషా, జిల్లా అధికార ప్రతినిధి, ఉపాధ్యక్షులు పత్తి సీతారాంబాబు, నెల్లూరు బ్లడ్ బ్యాంకు కో-ఆర్డినేటర్ మోపూరు భాస్కర్‌నాయుడు, వైద్యాధి కారులు, టెక్నీషియన్లు, డిసిసి ప్రధాన కార్యదర్శి విజయకుమార్, ఎన్ఎస్‌యుఐ నగర అధ్యక్షులు ముమిత్‌షా, మనోజ్, పవన్, నవీన్, శ్రీకాంత్, బాబ్జి, సమీర్, నాసిర్, మహేష్, శ్రావణ్ పాల్గొన్నారు.

### ధర్మరాజస్వామి దేవస్థానంలో

# 2 నుంచి దసరా ఉత్సవాలు

నెల్లూరు మూలాపేటలో వున్న శ్రీమత్ ద్రౌపదీదేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో అక్టోబర్ 2 నుంచి 11వ తేది వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కంచి నాగేశ్వరరావు, ఇ.ఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి తెలియజేశారు. అక్టోబర్ 2వ తేది రాత్రి 7.30 గంటలక కలశస్థాపన జరుగుతుందని, 3న మహాలక్ష్మిదేవి అలంకారం, 4న కాళీ అలంకారం, 5న త్రిపురసుందరి అలంకారం, 6న లలితాదేవి అలంకారం, 7న శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారం, 8న సరస్వతీదేవి అలంకారం, 9న దుర్గాదేవి అలంకారాలు నిర్వహిస్తామని, 10వ తేది ఉదయం 8 గంటలకు మూలవర్లకు అభిషేకం, రాత్రి 7.30 గంటలకు మహిషాసురమర్ధిని అలంకారం వుంటాయని తెలిపారు. 11వ తేదిన విజయదశమి సందర్భంగా పార్వేట ఉత్సవం వైభవోపేతంగా నిర్వహిస్తామని, భక్తులంతా ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామి వార్లను దర్శించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# గూడూరు పట్టణాన్ని అభివృద్ధి చేస్తాం

### - మున్సిపల్ ఛైర్‌పర్సన్ దేవసేన

గూడూరు పట్టణాన్ని అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. గూడూరు పట్టణ శివారులోని డంపింగ్‌యార్డు చెత్తగుట్టల తరలింపు ప్రక్రియను కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లతో కలిసి ఆమె సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. గూడూరు-నెల్లూరుకు వెళ్లే పాత మార్గంలో రోడ్డు పక్కనున్న డంపింగ్‌యార్డ్ దుర్గంధం వెదజల్లుతుండటంతో భారీ యంత్రాలతో చెత్తను మరోచోటకు తరలిస్తున్నారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ దేవసేన మాట్లాడుతూ డంపింగ్‌యార్డ్ స్థలంలో నూతనంగా ప్రహరీ నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే కౌన్సిల్‌లో తీర్మానం సైతం పొందినట్లు చెప్పారు. ప్రహరీ పూర్తయిన తర్వాత ఆ ప్రాంతంలో సుందరపార్కును ఏర్పాటు చేసేలా మొక్కలు పెంపకం చేస్తున్నామన్నారు. స్వచ్ఛభారత్‌ను సంపూర్ణంగా అమలు చేసేలా ప్రజలు కూడా సహకరించాలని కోరారు. గూడూరు పట్టణాన్ని దోమలు లేని ప్రాంతంగా చేయడమే లక్ష్యమన్నారు. అన్ని ప్రాంతాల్లో దోమల నివారణకు ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు పొనకా శివకుమార్‌రెడ్డి, మనపాటి రవీంద్ర, కౌన్సిలర్లు భాను, రమేష్, శ్రీనివాసులు, కల్పన, మస్తానమ్మ, షంషీరా, భారతి, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డు పనులు ప్రారంభిస్తున్న ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, ప్రక్కన కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

### షిరిడీలో

# గూడూరు చిన్నారుల ప్రతిభ



మహారాష్ట్రలోని షిరిడి సాయి మందిరంలో ఆరాధనోత్సవాల్లో భాగంగా గూడూరుకు చెందిన భరతనాట్య కళాకారిణులు ప్రతిభ చాటారని మంగళవారం సాయి నృత్య బృందం శిక్షకురాలు శైలజకుమారి తెలిపారు. ఆరాధనోత్సవాల్లో గూడూరుకు చెందిన అక్షిత, జ్వరిత, యశ్వని, శ్రావ్య, నీలానాగదుర్గ, సుశ్రిత, ప్రత్యూష సాయి బాబా దివ్యలీలామృతం, భరతనాట్యం ప్రదర్శించారన్నారు. దేవస్థాన ఛైర్మెన్ సునీల్‌మోహతి ఈ బృందాన్ని అభినందించి జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# సమాజసేవ చేస్తే తగిన గుర్తింపు

### - ఎమ్మెల్యే సునీల్‌కుమార్



జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీల్, క్లబ్ ప్రతినిధులు

పేదలకు సమాజసేవ చేయడంలో ముందు ఉంటే ప్రత్యేక గుర్తింపు సాధ్యమని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం లయన్స్ క్లబ్ ప్రతినిధి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికైన జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నెలబల్లి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి, క్లబ్ ప్రతినిధులు షేక్ రియాజ్‌అహ్మద్, కడివేటి చంద్రశేఖర్, జి.చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది చేసిన సేవా కార్యక్రమాలు ఎన్నడూ చేయలేదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వ్యాప్తి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల భవనం పనులకు రూ.3లక్షలను మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎం.మురళీరెడ్డి, సోమిశెట్టి చెంచురామయ్య, విశ్రాంత ఉద్యోగుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటీకరణను అడ్డుకోవాలి



సభలో మాట్లాడుతున్న సుధాకర్

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని తపాలా ఉద్యోగుల సంఘం నాయకుడు కె.సుధాకర్ తెలిపారు. గూడూరు మండలం చెన్నూరు గ్రామంలో అఖిల భారత తంతి తపాలా ఉద్యోగుల పోస్టుమెన్, ఎంటీఎస్‌ల రాష్ట్ర మహాసభలను ఆదివారం ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగిన ఈ సభలకు వివిధ ప్రాంతాలనుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం కార్మికుల శ్రమను దోచుకుని పెట్టుబడి దారులకు కొమ్ము కాస్తోందని తెలిపారు. సంయుక్తంగా కలిసి ప్రభుత్వాలపై పోరాటంతోనే సమస్యలను పరిష్కరించుకునే దిశగా ముందుగా సాగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖలను ప్రైవేటీకరణ చేసే దిశలో ఉందని, దీనిని గట్టిగా వ్యతిరేకించాలని కోరారు. సమ్మెలో తంతి తపాలా ఉద్యోగులు కీలకపాత్ర పోషించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ ప్రతినిధులు కృష్ణన్, శ్రీధరన్, సీతాలక్ష్మి, పాండు రంగారావు, చంద్రశేఖర్, మోహన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయులకు

# ఇన్నర్‌వీల్ సన్మానం



ఇన్నర్ వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో గూడూరు పట్టణం, సిఆర్ మార్గులోని ద్వారకామయి ఫంక్షన్ హాలులో ఆదివారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న వారిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించిన 15 మందికి నేషనల్ బిల్డింగ్ అవార్డులను ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మున్సిపాలిటి ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎంత ప్రోత్సాహం అందిస్తే అంత విలువలతో కూడిన విద్యను అందిస్తారని చెప్పారు. ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ సమాజంలో ఎవరినైనా క్రమశిక్షణతో తయారు చేయగలిగేది ఒక్క ఉపాధ్యాయుడే నన్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను మన సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు నాగసూరి గోపాలరావు, దశరథరామిరెడ్డి, కె.ముని గిరీష్, హరిప్రసాద్, పరమేశ్వరి, శ్రీకాంత్‌రెడ్డి, ఇన్నర్‌వీల్ క్లబ్, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో నౌకాశ్రయం

గల్పిక

విజయవాడలోని హైటెక్‌రత్న, ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాలయం. కృష్ణా, గుంటూరు జిల్లాల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నాడు. భారీ వర్షాలు కురుస్తున్నాయి, వరదలు వస్తున్నాయి, బాధితుల సహాయార్థం మీరేం చర్యలు తీసుకుంటున్నారని చంద్రబాబు అధికారులను ప్రశ్నించాడు. గుంటూరు జిల్లా కలెక్టర్ కాంతీలాల్ దండే స్పందిస్తూ... లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాం. రోడ్లు తెగిపోయాయి. రైల్ల పట్టాలు కొట్టుకుపోయాయి. రవాణా స్థంభించిపోయింది. రవాణాను పునరుద్ధ రించడానికి ఇంకొంత సమయం పడుతుందన్నాడు. అప్పుడు చంద్రబాబు... మనమింకా బ్రిటీష్ కాలం నుండి బయట పడడం లేదు. ఈ సింగపూర్ రాజధాని కాలంలో కూడా రవాణాకు ఇంకా రైళ్లు, బస్సులు, కార్లు వాడడమేంటి, నాన్సెన్స్... అందుకే ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఒక ఎయిర్‌పోర్టు, ప్రతి మండల కేంద్రంలోనూ ఒక హెలిపాడ్ నిర్మిస్తాం. కేంద్రం ఇచ్చే ప్యాకేజీ నిధులతో విమానాలు, హెలికాప్టర్లు కొంటాం. ప్రజలను వాటిల్లోనే తిప్పుతామని చెప్పాడు. వెంటనే కృష్ణా జిల్లా కలెక్టర్ అహ్మద్‌బాబు వుండి... సార్, ప్రత్యేకప్యాకేజీ నిధులను వీటికి కేటాయిస్తే మరి అభివృద్ధి పనులు ఎట్లా? అని అడిగాడు. చంద్రబాబు వెంటనే... ఏం జిల్లాకో ఎయిర్‌పోర్టు, మండలానికో హెలిపాడ్ అభివృద్ధి కాదా? పేద ప్రజలు కూడా విమానాలు, హెలికాప్టర్‌లు ఎక్కి ప్రయాణించడం అభివృద్ధి క్రిందకు రాదా? అని ఎదురు ప్రశ్నించడంతో అహ్మద్‌బాబు నోరెత్తలేదు. తర్వాత చంద్రబాబే... రాష్ట్రంలో రెండేళ్లకు సరిపడా వర్షాలు పడ్డాయంటే అది నా కృషి ఫలితమే! ఇక రెండేళ్ల దాకా కరువు అన్న మాటే వినిపించకూడదు అని వీడియో కాన్ఫరెన్స్ ముగించాడు. అప్పుడే మంత్రులు పి.నారాయణ, కె.ఇ.కృష్ణమూర్తి, నిమ్మకాయల చినరాజప్ప, దేవినేని ఉమ, పత్తిపాటి పుల్లారావులు వచ్చారు. ఏం సార్, అర్జంట్‌గా రమ్మన్నారని కె.ఇ.కృష్ణమూర్తి అడిగాడు. మనం ఈరోజు ఒక నిర్ణయం తీసుకోవాలి. మన అమరావతి రాజధానిని ఏ సిటీ తరహాలో కట్టాలో లక్కీడిప్ ద్వారా నిర్ణయిద్దాం. ప్రపంచంలోని అన్ని మేటి రాజధాని నగరాల పేర్లు స్లిప్పులలో వ్రాసి ఈ డబ్బాలో వేసాను. ఇందులో నుండి ఒక చీటీ తీయండి. అందులో ఏ నగరం పేరుంటే ఆ నగరంలాగా అమరావతి రాజధానిని నిర్మిద్దామని చంద్రబాబు చెప్పాడు. తర్వాత డబ్బాను ఊగులాడించి మూత తీసి కె.ఇ.కృష్ణమూర్తిని ఒక చీటీ తీయమన్నాడు. కృష్ణమూర్తి చేయిపెట్టి ఒక చీటీ తీసాడు. దానిమీద సింగపూర్ అని వ్రాసుంది. చంద్రబాబుతో పాటు అందరూ చప్పట్లు కొట్టారు. తర్వాత పత్తిపాటి పుల్లారావు డబ్బాను బయటకు తీసుకెళ్లి ఎందుకో డౌటొచ్చి మిగతా చీటీలను కూడా తీసి చూసాడు. ఆశ్చర్యం.. అన్నింటి మీద 'సింగపూర్' అని వ్రాసి వుంది. ఆ సీక్రెట్‌ను పుల్లారావు బయట పెట్టకుండా తన గుండెల్లోనే దాచుకున్నాడు. తర్వాత చంద్రబాబు మంత్రులతో... ఈ ప్రపంచంలో దేవుడికి తప్ప ఇంకెవరికీ సాధ్యంకానిది నేను సృష్టించాను. అదేంటో చెప్పుకోండి చూద్దాం అని పజిల్ విసిరాడు. ఒకరు హైటెక్ సిటీ అంటే ఇంకొకరు సింగపూర్ రాజధాని అన్నారు. ఒకరు సెల్‌ఫోన్‌లు కనిపెట్టారంటే... ఇంకొకరు కంప్యూటర్లు కనిపెట్టారని చెప్పారు. చంద్రబాబే కల్పించుకుని... ఇవేమీ కాదు... పట్టిసీమ నది... ఈ ప్రపంచ చరిత్రలో నదులన్నీ సహజసిద్ధంగా ఏర్పడ్డవే! మన ఇతిహాసాలలో చెప్పినట్లు దేవుడు సృష్టించినవే! కాని పట్టిసీమ నది మాత్రం నా సృష్టే అని చెప్పాడు. వెంటనే నిమ్మకాయల చినరాజప్ప కలుగజేసుకుని... సార్, ఈ పట్టిసీమ నదిని మీరెందుకు సృష్టించారో నాకర్థమైంది. ఒక ఏడాది గోదావరి పుష్కరాలు, ఇంకో సంవత్సరం కృష్ణ పుష్కరాలతో గడిచిపోయింది. ఇప్పుడు పట్టిసీమ నదికి కూడా పుష్కరాలు జరిగితే ఇంకో సంవత్సరం దాటేయవచ్చు... ఆ తర్వాత ఎలాగూ ఎలక్షన్ ట్రెండ్ స్టార్ట్ అవుతుంది... ఇదేగా మీ ప్లాన్ అని చెప్పాడు. చంద్రబాబు అవునన్నట్లు తలూపుతూ... ఈ సీక్రెట్ ఎక్కడా బయటకి రానీయవద్దు అని చెప్పాడు.

★★★★★

హైదరాబాద్‌లోని తెలంగాణ సీఎం కేసీఆర్ ఛాంబర్. కృష్ణపట్నం పోర్టు ఛైర్మెన్ సి.విశ్వేశ్వరరావు, యం.డి. శశిధర్, సిఇఓ అనిల్ ఎండ్లూరి, పోర్ట్ పిఆర్ హెడ్ వేణుగోపాల్‌లు అక్కడ ఉన్నారు. కేసీఆర్ వారితో... హుస్సేన్‌సాగరం వద్ద మీరు పోర్టు కట్టాలన్నాడు. ఆ మాటతో అందరికీ పట్టపగలే కళ్ల ముందు చుక్కలు కనిపించాయి. కొద్దిసేపటికి తేరుకుని... హుస్సేన్‌సాగర్‌లో పోర్టు ఎలా కట్టగలమని విశ్వేశ్వరరావు ప్రశ్నించాడు. ఎందుకు కట్టలేరు. కృష్ణపట్నం వద్ద కట్టారుగా... అని కేసీఆర్ అన్నాడు. అక్కడంటే సముద్రం వుంది కాబట్టి కట్టగలిగామని అనిల్ ఎండ్లూరి అన్నాడు. హుస్సేన్‌సాగర్‌ను కూడా మేం సముద్రంగానే పిలుస్తాం... ఇక నుండి ఇది హుస్సేన్ సాగరం... ఈ వర్షాలకు మీరు చూసే వుంటారు... హుస్సేన్ సాగర్ సముద్రంగా మారడాన్ని. బంగాళాఖాతం నుండి హుస్సేన్‌సాగర్ దాకా కాలువల ద్వారా లింకులున్నాయి... కాబట్టి ఆ కాలువల గుండా నౌకలను పంపించవచ్చు... అయినా ఏపిలో పిల్లకాలువలను తవ్వి చంద్రబాబునాయుడు 'పట్టిసీమ నది' అని పేరు పెట్టగా లేనిది మేము హుస్సేన్‌సాగర్‌ను సముద్రంగా మార్చుకోలేమా? ఇప్పుడు మా దృష్టిలో ఇది హుస్సేన్‌సాగరమే! కాబట్టి ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం క్రింద ఇక్కడ పోర్టును నిర్మించాలనుకుంటున్నాను. అలాగే హుస్సేన్‌సాగరంకు అనుసంధానంగా నగరంలోని అన్ని ప్రాంతాలకు స్పీడ్‌బోట్లు ఏర్పాటు చేయండి. వాటిని కూడా మీరే ఏర్పాటు చేసుకుని కలెక్షన్ కూడా మీరే వసూలు చేసుకోండి. వర్షాకాలంలో మంచి ఆదాయముంటుంది. ఎలాగూ భారీ వర్షాలప్పుడు నగరంలో రైళ్లు, బస్సులు నడిచే పరిస్థితి లేదు.. రోడ్లు కాలువలు లాగే వుంటాయి. హుస్సేన్‌సాగర్ పోర్టును మీరే కట్టి, 30ఏళ్ల పాటు దాని మీద వచ్చే ఆదాయాన్ని కూడా మీరే తీసుకోండి. పోర్టు నిర్మాణానికి ఏమన్నా అడ్డంగా వున్నాయంటే చెప్పండి, వాటిని వెంటనే కూలగొట్టిస్తాను. కాబట్టి సరైన ప్రతిపాదనలతో రండి... ముందు హుస్సేన్‌సాగరం పోర్ట్‌కు మంచి డిజైన్ తయారు చేయండి అంటూ లేచాడు. కృష్ణపట్నం పోర్టు ఛైర్మెన్, ఎం.డి, సిఇఓలకు ఏం చెప్పాలో అర్థంకాక తలలు గోక్కుంటూ లేచారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఖర్చులకు తగిన ఆదాయం ఉంటుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. ఇంట్లో, బంధు వర్గంలో అనారోగ్య బాధితులుంటారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. చేయదలచిన పనులను నైతారంగా జరుపుకొనవలసి వుంటుంది. ఉద్యోగులకు పని భారం, బాధ్యతలు అదనంగా ఉంటాయి. ఆరోగ్యం ఫరవాలేదనిపిస్తుంది. శుభవార్తలు వింటారు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి. వృత్తి వ్యాపార జీవనము కలవారికి ఆర్థిక స్థితి బాగుంటుంది. కొత్త వ్యాపారాలు కొత్త పెట్టుబడులకు అవకాశాలుంటాయి. స్వల్పంగా అనారోగ్య బాధలుంటాయి. దూర ప్రయాణాలు చేయవలసి రావచ్చును. ఆర్థిక, సామాజిక వ్యవహారాలను జాగ్రత్తగా నిర్వహించండి. స్థిరాస్తుల వ్యవహారాలను వాయిదా వేసికొనడం మంచిది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అనుకోని స్వల్ప ఆదాయము, వస్తు లాభముంటుంది. ఆర్థిక ప్రగతి బాగుండి, వృత్తి వ్యాపారాలు పెరుగుతాయి. ఆలోచనలు కార్య రూపం దాల్చి పనులు సాఫీగా సాగుతాయి. పలుకుబడి పెంచుకొనేందుకు, ఆడంబరాలకు ఖర్చులు పైనబడగలవు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. బిల్లులు చెల్లింపులు సకాలంలో చేస్తారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్థిక పరిస్థితి బాగున్నా, ఆదాయం సామాన్యంగా ఉంటుంది. అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. కొత్త పెట్టుబడులకు అవకాశాలుంటాయి. అనుకున్న పనులు హడావిడిగా జరుగుతాయి. స్థిరాస్తుల పరిష్కారాలకు ముమ్మర ప్రయత్నాలుంటాయి. తొందరపడి నమ్మకం పెంచుకొని ధన సహాయం చేయవద్దు. అనుకోని ప్రయాణాలుంటాయి. శుభకార్య ప్రయత్నాలు ఫలించవచ్చు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులు నిదానంగా జరుగుతూ టెన్షన్ పెడతాయి. పెండింగ్‌లోగల సమస్యలు పరిష్కారానికి రాగలవు. సమావేశాలలో మీ మాటకు విలువ వుంటుంది. కొత్త వస్తువులు పరికరాలు కొంటారు. శుభకార్య ప్రయత్నాలు నిర్ణయం కాగలవు. ఉద్యోగుల శ్రమకు గుర్తింపు, గౌరవాలుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కుటుంబ ఆర్థిక పరిస్థితులు క్రమంగా బాగుపడతాయి. ఆదాయం పెరుగుతుంది. బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. సమయానికి తగ్గట్లు నిర్ణయాలు జరుగుతాయి. కుటుంబంలో శుభకార్యాలు ఖరారు కాగలవు. దైవ కార్యాలలో పాల్గొంటారు. సమావేశాలకు ఆహ్వానాలు అందుతాయి. బంధుమిత్రుల రాకపోకలుంటాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 30.9.2016 నుండి
తేది. 6.10.2016 వరకు

ఈ వారం సింహంలో బుధ రాహువులు, 3తేది నుండి కన్యలో బుధుడు, కన్యలో రవిగురువులు, తులలో శుక్రుడు, వృశ్చికంలో శని, ధనుస్సులో కుజుడు, కుంభంలో కేతువు, కన్య తుల వృశ్చికాలలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

గురుమౌఢ్యమి జరుగుతున్నది. ముహూర్తములుండవు.

తేది 30 శుక్రవారము మహాలయ అమావాస్య
తేది 1 శనివారము శరన్నవరాత్రముల ప్రారంభము
తేది 2 ఆదివారము గాంధీ జయంతి

**భాద్రపద మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 30 | శుక్ర | అమావాస్య | రా॥ గం.4.02వ॥ |

**ఆశ్వయుజ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 1 | శని | పాడ్యమి | రా॥ గం.5.27వ॥ |
| తేది. 2 | ఆది | విదియ | పూర్తిగ |
| తేది. 3 | సోమ | విదియ | ఉ॥ గం.7.21వ॥ |
| తేది. 4 | మంగళ | తదియ | ఉ॥ గం.9.24వ॥ |
| తేది. 5 | బుధ | చతుర్థి | ఉ॥ గం.11.00వ॥ |
| తేది. 6 | గురు | పంచమి | ప॥ గం.1.28వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అవసరాలకు, చెల్లింపులకు కొద్ది ఋణం చేయడం గాని, వాయిదా వేసికొనడం గాని జరుగుతుంది. వృత్తి పరంగా మంచి అవకాశాలుండినా వ్యాపారవృద్ధి అవకాశాలు చేజారవచ్చును. ఆదాయం సామాన్యం. బంధు వర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. ప్రభుత్వ అనుమతులకు ఆలస్యం జరుగవచ్చును. శుభకార్య ప్రయత్నాలు అనుకూలం. విద్యావృద్ధికి గట్టి కృషి అవసరం.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

పనులు నిదానంగా జరగడంగాని, ఆటంకాలు రావడం వల్ల నిలిచిపోవడం జరుగుతుంది. ఆర్థికంగా బాగుండి వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, రాబడి బాగుంటుంది. వ్యవహారాల నిర్వహణలో తగిన నిర్ణయాలు చేయడం, అందరితో సత్సంబంధాలు ఏర్పరచు కొనడం, పలుకుబడి, విలాసములకు ఖర్చులు పెట్టడం జరుగుతుంది. విలువైన పత్రాలను జాగ్రత్త పరచుకొనాలి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

అనుకున్న పనులను పట్టుదలతో చేస్తారు. సభలు సమావేశాలలో మీ పలుకుబడి బాగుంటుంది. ప్రభుత్వ అనుమతులు బ్యాంకు ఋణాలు లభించగలవు. కొంత విచ్చలవిడి ఖర్చులు పెట్టక తప్పదు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులకు అధికారుల ఆదరణతో పాటు, కొత్త పనులు అప్పగింపబడతాయి. కొత్త పెట్టుబడులకు అవకాశాలుంటాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

బంధువర్గంతోను, సహచరులతో జాగ్రత్తగా ఉండండి. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడతాయి. రావలసిన బాకీలు అలానే ఉంటాయి. కొత్త వ్యాపారాలకు పెట్టుబడులకు అనుకూల సమయం. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం తృప్తికరంగా ఉంటుంది. శ్రమతో అనుకున్న పనులను జరుపుకొంటారు. కొందరి విమర్శలుంటాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించండి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థికాభివృద్ధికై ప్రయత్నాలు నిరుత్సాహాన్ని కలిగిస్తాయి. వృత్తి పరంగా ఆదాయం తృప్తికరం వ్యాపారవృద్ధి అవకాశాలు చేజారి సామాన్య ఆదాయముంటుంది. ఇతరుల నుండి విమర్శనలు ఎదుర్కొనక తప్పదు. ఉద్యోగ బాధ్యతలలో మార్పులు, పనిభారం ఉంటుంది. సొంత పనులు నిదానంగా సాగుతాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

భార్యా బిడ్డలకు, ముఖ్యంగా స్త్రీలకు అనారోగ్య బాధలుంటాయి. వస్తు వాహన గృహ రిపేర్లుంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం బాగుంటుంది. సభలు సమావేశాలలో మంచి గుర్తింపు గౌరవాలుంటాయి. ఉద్యోగులకు కార్యసామర్థ్యం, స్థానమార్పు ఉంటుంది. ఇంటికి కొత్త విలువైన వస్తువులు, పరికరాలు కొంటారు. బాకీల చెల్లింపులు సకాలంలో జరుగుతాయి.

## షాదీ ముబారక్



నెల్లూరీయుడు, గుంటూరు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆఫీసులో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పని చేస్తున్న షేక్ అబ్దుల్ కరీం కుమార్తె షేక్ షబానా సుల్తానా - సిరాజుద్దీన్ బాబావలీ (బాపట్ల వాస్తవ్యులు షేక్ మస్తాన్‌వలీ కుమారుడు)ల నిఖా సెప్టెంబర్ 22వ తేదీ గుంటూరులోని మెట్టు అంజిరెడ్డి కన్వెన్షన్ హాల్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# మహాకుంభాభిషేకానికి భారీ ఏర్పాట్లు

## - జనవరిలో శుభముహూర్తం

శ్రీకాళహస్తి న్యూస్

దక్షిణకాశీ క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన శ్రీ కాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరాలయంలో దాదాపు పదిహేడు సంవత్సరాల తర్వాత మహా కుంభాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పండితులు సుముహూర్తం నిర్ణయించారు. ఈ ఆలయంలో 2000వ సంవత్సరంలో మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత మళ్ళీ కుంభాభిషేకానికి ఏర్పాట్లు జరగడం ఇదే. ఈ విషయమై ఆలయం కార్యనిర్వహణాధికారి డి.భ్రమరాంబ మాట్లాడుతూ, వచ్చే జనవరి 28వ తేది నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు మహాకుంభాభిషేకం నిర్వహించాలని పండితులు నిర్ణయించారని, ఈ ఏడాది ఆగస్టు 26 నుంచి 28వ తేదీ వరకు స్వామి, అమ్మవార్లకు బాలాలయ స్థాపన కార్యక్రమం జరిగింది కనుక, ఆగస్టు 28 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 8వ తేదీ వరకు ఆలయంలో స్వామి, అమ్మవార్లకు నిత్యపూజలు మాత్రమే జరుగుతాయని, మిగిలిన అన్ని ఆర్జిత సేవలు రద్దు చేయడం జరుగుతుందని, నిత్యం జరిగే రాహుకేతు పూజలు మాత్రం ప్రతిరోజూ యధావిధిగా జరుగుతాయన్నారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మెన్ పోతుగుంట గురవయ్యనాయుడు మాట్లాడుతూ, కుంభాభిషేకం పనుల్లో భాగంగా ధ్వజస్తంభం పనులకు చిత్తూరు ఎమ్మెల్యే, భిక్షాల గాలిగోపురం పనులకు నెల్లూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, వదాన్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దాతలుగా వున్నారన్నారు. స్వామివారి గోపురం నిర్మాణపనులను ఆలయ ఇ.ఓ, సిబ్బంది, అర్చకులందరూ కలసి నిర్వహిస్తామన్నారు. ఈ మహాకుంభాభిషేక మహోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని ఆహ్వానించాలని నిర్ణయించుకున్నామన్నారు.

కావలి కబుర్లు

# సమస్యలను పరిష్కరిస్తాం



అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ అలేఖ్య

గ్రీవెన్స్ డే లో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చొరవచూపుతామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య అన్నారు. కావలి పురపాలక సంఘంలో సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా ప్రజలనుండి అర్జీలను సేకరించారు. ఈ అర్జీలు పరిష్కారంకోసమై వివిధ శాఖలకు పంపి వెంటనే పరిష్కారమయ్యేలా చూస్తామని కమీషనర్ వెంకటేశ్వర్లు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అలేఖ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశానుసారం మున్సిపల్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే ఇటీవల ప్రారంభించామని దీనికి ప్రజలనుండి అనూహ్య స్పందన లభించిందన్నారు. ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని ప్రజాసమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చిత్తశుద్ధితో కృషిచేస్తున్నారన్నారు. పట్టణ శివారులో ఉన్న డంపింగ్‌యార్డ్‌ను త్వరలో అర్బన్ గ్రీనింగ్ డెవలెప్‌మెంటు వారి సహకారంతో ఉద్యానవనంగా మారుస్తామన్నారు. శ్మశానాన్ని బాగుచేసి శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని దోమల నివారణకు పలు చర్యలు తీసుకుంటున్నామని ప్రజలుకూడా తమచుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# పోర్టు సాధనతోనే కావలి అభివృద్ధి

## - పోర్టు సాధన కమిటీ నేత వంటేరు





రామాయపట్నంలో పోర్టు, షిప్ యార్డ్‌ల నిర్మాణం జరిగితే కావలి పట్టణంతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలు సర్వతోముఖాభివృద్ధి చెందుతాయని రామాయపట్నం పోర్టు సాధన కమిటీ నేత, కావలి మాజీ శాసనసభ్యులు వంటేరు వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. 24వతేదీ పోర్టు సాధనకోసం కావలి గ్రామ దేవత కలుగోళశాంభవి ఆలయం నుండి రామాయపట్నం వరకు పాదయాత్ర నిర్వహించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అథిథులుగా నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, ప్రకాశం ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, వైకాపా జిల్లా అధ్యక్షులు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రకాశం జిల్లా సిపిఐ కార్యదర్శి అరుణమ్మ, కందుకూరు నియోజకవర్గ వైకాపా కన్వీనర్ తూమాటి మాధవరావు లు పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేణుగోపాల్‌రెడ్డిలు స్థానిక ఆర్ అండ్ బీ అథిథి గృహం నుండి మోటార్ సైకిళ్ళపై ర్యాలీగా కలుగోళ శాంభవి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ జరిగిన సభలో ఎంపీ రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు సాధన కోసం మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి చేపట్టిన సాహసోపేతమైన పాదయాత్రతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్ళు తెరవాలన్నారు. పోర్టు కోసం పోరుబాట పట్టిన వంటేరుకు తామంతా అండగా నిలుస్తామన్నారు. ఒంగోలు ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ మంజూరైన పోర్టు నాటి కాంగ్రెస్ నాయకుల కుట్రవల్లనే ఆగిపోయిందన్నారు. ఎన్నికల సమయంలో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలోనూ పోర్టు మంజూరు చేస్తామని వాగ్దానం ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే మంజూరు చేయాలని ఆయన డిమాండ్‌చేశారు. కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన కావలి, ఉదయగిరి, ఆత్మకూరు, కందుకూరు, కొండెపి నియోజకవర్గాలు పోర్టు ఏర్పాటుతో అభివృద్ధి చెందుతాయని తామంతా కోరుతుంటే.. ఇదే ప్రాంతంలో అణువిద్యుత్తు కేంద్రం ఏర్పాటుచేసి వినాశనానికి తెదేపా నడుబిగిస్తుందన్నారు. పోర్టు సాధించేవరకు పోరాటం చేస్తామని ఆయన చెప్పారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విభజన సమయంలో ఇచ్చిన హామీప్రకారం పోర్టును ఏర్పాటుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. కానీ అణువిద్యుత్తు కేంద్రం పెట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్సాహం చూపిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే కాకాని గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు దుగరాజుపట్నం ఎంత ముఖ్యమో రామాయపట్నం పోర్టు అంతే ముఖ్యమని అన్నారు. పోర్టు సాధన కమిటీనేత వంటేరు వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ తన చిన్నప్పటి నుంచి కావలి కనకపట్నం అనే మాట ఇంటున్నానని, ఇది సాధ్యం కావాలంటే.. రామాయపట్నం పోర్టుతోనే జరుగుతుందన్నారు. తాము దుగరాజు పట్నం పోర్టుకు వ్యతిరేకం కాదని కానీ వెనుకబడ్డ ప్రాంతాలైన కావలి, ఉదయగిరి, ఆత్మకూరు, అటూ ప్రకాశం జిల్లా రామాయపట్నం పోర్టుతో అభివృద్ధి చెందుతుందన్నారు. పోర్టు రావడంతో అనుబంధ పరిశ్రమలు వస్తాయని దీంతో ఈప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు వచ్చి వారి జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు సుకుమార్ రెడ్డి, గోసల గోపాల్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, శివకుమార్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, పద్మనాభరెడ్డి, కామరాజు, కామయ్య, ప్రసన్నాంజనేయులు, యేరువ రమేష్, జలదంకి ఎంపీపీ వంటేరు హైమావతి, జడ్పీటీసీ శివలీల, సీపీఐ నాయకులు దామా అంకయ్య, అరుణమ్మ, దేగా సత్యం పాల్గొన్నారు.

# విద్యార్థులకు పూర్తి సౌకర్యాలు



పదహారువేల కోట్లు లోటు బడ్జెట్ ఉన్నా విద్యార్థులకు పూర్తి సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని, అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అభినందిస్తున్నామని టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాకర్ల తిరుమలనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణ తెలుగునాడు విద్యార్థి సమాఖ్య సమావేశం పట్టణ అధ్యక్షుడు దేగా పూర్ణచంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తిరుమల నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు ఉపకార వేతనాలు, రాయితీలు అందచేస్తూ విద్యార్థుల జీవితాలలో వెలుగునింపుతున్నారన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యతో సమానంగా విద్యను అందించేందుకు రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పట్టణ తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు మలిశెట్టి వెంకటేశ్వర్లును, జిల్లా టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు కాకర్ల తిరుపతి నాయుడును విద్యార్థిసంఘాల నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి మనోజ్, నాయకులు శివ, ప్రసన్నకుమార్, శివకుమార్, వెంకటరత్నం, జంపాని మల్లి, ప్రశాంత్, షబ్బీర్, నాని పాల్గొన్నారు.

# విద్యార్థులకు భగత్‌సింగ్ ఆదర్శం



భగత్ సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యు నాయకులు

భగత్‌సింగ్ దేశ భక్తిని విద్యార్థులు అలవర్చుకోవాలని పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఏ.రవి చంద్ర అన్నారు. మంగళవారం భగత్‌సింగ్ 110వ జయంతి సందర్భంగా స్థానిక విశ్వోదయ స్కూల్ సమీపంలో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ.. 23 సంవత్సరాలు వయసులోనే స్వాతంత్ర్యంకోసం ఉరికంబాన్ని సైతం చిరునవ్వుతో ఆహ్వానించి దేశభక్తిని చాటుకున్న మహోన్నతమైన వ్యక్తి భగత్‌సింగ్ అని కొనియాడారు. పొలాల్లో పంటకు బదులు తుపాకులు నాటితే తుపాకులు వస్తాయా అని, వాటితో బ్రిటీషు వారిని తరిమివేయవచ్చా... అని భగత్‌సింగ్ చిన్నతనంలోనే తన తండ్రిని అడిగారన్నారు. అలాంటి వ్యక్తిని ఆదర్శంగా తీసుకుని దేశంకోసం పాటుపడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు భాస్కర్, నాగరాజు, ప్రసన్న, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పాక్‌కు షాక్

(మొదటి పేజీ తరువాయి)

ఉగ్రవాద శిబిరాలపై సర్జికల్ దాడి, సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో 29వ తేదీ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. భారత సైనిక చర్యను అన్ని పక్షాలు కూడా ఆమోదించి అభినందించాయి. దేశ భద్రత విషయంలో దేశం యావత్తు సైనికుల వెంట నడుస్తుందని భరోసా ఇచ్చాయి.

ఇక పాకిస్థాన్ సరిహద్దుల్లోని జమ్మూ, కాశ్మీర్, గుజరాత్, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రప్రభుత్వం అప్రమత్తం చేసింది. సరిహద్దుకు 10 కిలోమీటర్ల లోపు వున్న జనావాస ప్రాంతాలను ఖాళీ చేయించమని ఆదేశించింది. ఇవి ముందు జాగ్రత్తచర్యలలో భాగంగానే కనిపిస్తోంది.

యూరీ దాడితో పాకిస్తాన్ తన గొయ్యిని తానే తవ్వుకున్నట్లయ్యింది. ప్రపంచంలో ఏ దేశం కూడా పాకిస్థాన్‌ను సమర్ధించడం లేదు. ఆఖరికి చైనా కూడా యుద్ధం వస్తే ఆదుకుంటామని ధైర్యం చెప్పలేదు. ఇస్లామాబాద్‌లో తలపెట్టిన సార్క్ సమావేశాలను భారత్‌తో పాటు సభ్యదేశాలైన భూటాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లు బహిష్కరించాయి. పాక్‌కు ఇది తీరని అవమానం. దౌత్యపరంగా పాక్‌ను అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టడంలో భారత్ అద్వితీయ పాత్ర పోషించింది. అదే వేదికలపై పాక్‌లో పేట్రేగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనను కూడా ప్రపంచం దృష్టికి తీసుకు రాగలిగింది.

అన్నింటికన్నా ముఖ్యమైనది 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని సమీక్షించడం. భారత్ ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకుంటే పాకిస్థాన్ నీళ్లకు అల్లాడి చావాలి. ఆ దేశంలో సగం పంటలకు మన దేశం గుండా ప్రవహించే సింధు, జీలం, చీనాబ్ నదుల జలాలే ఆధారం. ఈ నీళ్లు ఆపితే ఆ దేశం ముందు ఆర్థికంగా నష్టపోవడం ఖాయం. కాబట్టి దీనిపై కూడా కేంద్రం పరిశీలన జరుపుతోంది. అన్ని వైపుల నుండి పాకిస్థాన్‌ను చుట్టుముట్టింది భారత్! ప్రపంచమంతా మనవైపున్న ఈ తరుణంలోనే పాక్ అనే విషనాగు కోరలను పూర్తిగా పీకేయాలి. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భారత్ సేనలు సిద్ధంగా ఉన్నాయి. తమ జనరల్స్ ఆదేశిస్తే కధనరంగంలోకి దిగి కత్తులు దూసి పాక్ కుత్తుక కత్తిరించ డానికి ఉత్సాహం చూపుతున్నాయి.

## శ్రీ దత్తసాయి మందిరంలో
## 10-11 తేదీల్లో దశమి వేడుకలు

నెల్లూరులోని కొండాయపాళెం గేటు వద్ద రవీంద్రనగర్ 2వ వీధిలో వున్న శ్రీ దత్తసాయి భరద్వాజ మందిరంలో అక్టోబర్10, 11 తేదిల్లో శ్రీ సాయిబాబా 98వ మహాసమాధి, విజయదశమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. 10న ఉదయం 6 గంటలకు స్వామివారికి కాకడ హారతి, 8 గంటలకు రుద్రాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు హారతి, రాత్రి 9 గంటలకు శేజ్‌హారతి నిర్వహిస్తామన్నారు. 11వతేది శ్రీ సాయిబాబా మహాసమాధి మహోత్సవం ఘనంగా నిర్వహిస్తామని, ఆరోజు ఉదయం 6గంటలకు స్వామివారికి కాకడ హారతి, 8 గంటలకు అభిషేకం, 9 గంటలకు ఉభయకర్తల పూజ నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారికి మధ్యాహ్న హారతి నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ వుంటుందన్నారు. చెరుకుపల్లి పిచ్చిరెడ్డి జ్ఞాపకార్ధం వారి శ్రీమతి సుబ్బరత్నమ్మ అన్నసంతర్పణకు ఉభయ కర్తలుగా వ్యవహరిస్తారని నిర్వాహకులు తెలిపారు. భక్తులందరూ ఈ వేడుకలకు విచ్చేసి స్వామివార్లను దర్శించుకుని తరించాల్సిందిగా వారు కోరారు.

## ఇరుకళలమ్మ
## శరన్నవరాత్రి మహోత్సవాలు

భక్తులచే తొలిపూజలందుకొనే సింహపురి గ్రామ దేవత, నెల్లూరు మూలాపేటలో వేంచేసియున్న శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబర్ 1 నుండి 11వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. 1వ తేదీ శనివారం ఉదయం 10గంటలకు శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి అలంకారం జరుగుతుంది. 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 6గంటలకు శ్రీ అన్నపూర్ణాదేవి, శ్రీ గజలక్ష్మి, శ్రీ సరస్వతి, శ్రీ భవాని, శ్రీ మహాలక్ష్మి, శ్రీ దుర్గా, శ్రీ చండి, శ్రీ లలితా పరమేశ్వరి, శ్రీ మహిషాసురమర్ధిని, శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి అలంకారాలు జరుగుతాయి. ఈ 11రోజులు అమ్మవారికి లక్ష కుంకుమార్చన, చండీయాగం తదితర విశేషపూజలు జరుగుతాయి. ఈ కార్యక్రమాల్లో సింహపురి ప్రజలు వేలాదిగా పాల్గొని అమ్మవారి తీర్ధప్రసాదాలను స్వీకరించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి యం.జానకి, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ మెట్టు సురేష్‌బాబులు కోరారు.

# మీనాక్షీ... ముంచావే!


(5వ పేజీ తరువాయి)

పెందుర్తి, కలివెలపాలెం గ్రామాల పరిధిలో 3వేల ఎకరాలలో వేశారు. వరికి కూడా బిపిటి రేట్లు వస్తాయని ఆశపెట్టారు. తీరాచూస్తే నాలుగు నెలలన్న పంట ఐదున్నర నెలలు కానిదే రావడం లేదు. ఐదున్నర నెలల తర్వాత పైరు కోసి నూరిస్తే ఎకరాకు పుట్టి, పుట్టిన్నరకు మించి ధాన్యం రాలేదు. పెట్టుబడి మాత్రం ఎకరాకు పాతికవేలు దాకా అయ్యింది. ఈ రకం ధాన్యానికి 10వేలకు మించి ధర రావడం లేదు. ఎకరాకు ఒకటిన్నర పుట్టికి మించని ధాన్యాన్ని చూసి రైతులు లబోదిబోమంటున్నారు. ఎకరా మీద 20వేలదాకా నష్టం వస్తుంది. డీలర్ల మాటలు నమ్మి మోసపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

## వ్యవసాయాధికారుల నిర్లక్ష్యం



రైతులకు జరిగిన అన్యాయంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొరపాటి మురళీ నాయుడు స్పందించారు. వ్యవసాయాధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందంటున్నారు. రబీ, ఖరీఫ్ సీజన్‌లకు ముందు వ్యవసాయశాఖాధికారులే ప్రతి మండలంలోనూ రైతులకు అవగాహన సదస్సులు పెట్టాలి. ఏ నేలకు ఏ వంగడాలు సరైనవో వివరించాలి. మార్కెట్‌లో నకిలీ విత్తనాలు వస్తున్నాయి. కాబట్టి విత్తన కేంద్రాలలో కూడా వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించాలి. కాని రైతుడిపో డీలర్లతో కుమ్మక్కై వ్యవసాయాధికారులు అవేమీ చేయడం లేదని, వారి స్వార్ధానికి ఈరోజు రైతులు నష్టపోయారని ఆయన ఆరోపించారు.





### రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మెన్‌గా
## ఏనుగ జయరామిరెడ్డి

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మెన్‌గా ఎస్వి యూనివర్శిటీ విశ్రాంత రిజిస్ట్రార్ ఏనుగ జయరామిరెడ్డిని నియమిస్తూ 29వ తేదీ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయనకు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్ పదవి దాదాపు ఖరారైనప్పటికీ రాష్ట్ర విభజనకు సంబంధించిన పలు శాఖల అంశాలు పెండింగ్‌లో ఉన్నందున్న ఈ పదవిని ఇవ్వలేకపోయారు. ఇప్పుడు ఆయనను టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్‌గా నియమించి ఇంతకాలం ఆయన పార్టీకి అందించిన సేవలకు తగిన బహుమానం అందించాడు ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్తూరుజిల్లాకు చెందిన జయరామిరెడ్డి చంద్రబాబుకు అత్యంత ఆప్తమిత్రుడు. ఇద్దరూ కలిసి చదువుకున్నారు. జయరామిరెడ్డి రిజిస్ట్రార్‌గా పదవీ విరమణ చేసిన తర్వాత తెలుగుదేశంపార్టీ కార్యాలయ బాధ్యతలు చూస్తూ వచ్చారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సైతం చంద్రబాబుకు అండగా నిలిచారు. జయరామిరెడ్డికి నెల్లూరుతోనూ బంధం, బంధుత్వం ఉంది. ప్రముఖ కవి, దివంగత వాకాటి పెంచలరెడ్డికి ఆయన స్వయాన అల్లుడు. మాడరన్ స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డికి బావ అవుతాడు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థకు వన్నెతెచ్చేలా తన పనితీరును చూపాలని కోరుతూ జయరామిరెడ్డికి అభినందనలు తెలుపుతోంది 'లాయర్'.



### శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి
## శరన్నవరాత్రి ఉత్సవాల శోభ

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం శరన్నవరాత్రి ఉత్సవాల శోభతో వెలిగిపోతోంది. అక్టోబర్ 1 నుంచి 11వ తేది వరకు అమ్మవారి 42వ శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా 1వ తేదిన చండీ అలంకారం, 2న భవాని, 3న గాయత్రి, 4న అన్నపూర్ణ, 5న గజలక్ష్మి, 6న మహాలక్ష్మి, 7న కాళిక, 8న సరస్వతి, 9న దుర్గా, 10న మహిషాసురమర్ధిని అలంకారాలతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. 10వ తేది సాయంత్రం మాజీమంత్రి ఆదాల అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. 11న ప్రముఖ వదాన్యులు ఆల్తూరు ఆదినారాయణరెడ్డి-సులోచనమ్మ దంపతుల ఉభయకర్తృత్వంలో అమ్మవారికి విశేషమైన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి అలంకారం కన్నులపండువగా నిర్వహిస్తారు. 11న విజయదశమిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయంలో శమీపూజ, పారువేట అనంతరం నగరోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. విజయదశమి సందర్భంగా 11న ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మహాభిషేకం నిర్వహిస్తారు. 12వ తేది మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి సన్నిధిలో జరిగే అన్నదానం కార్యక్రమానికి వదాన్యులు ఆల్తూరు ఆదినారాయణరెడ్డి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరిస్తారు. అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు కనుక, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్, ఆలయ కార్యనిర్వహణాధికారి పి. కోదండరామిరెడ్డి తదితరుల పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఆనం వెంకురెడ్డికి నివాళులు

మాజీ మంత్రి ఆనం వెంకురెడ్డి జయంతిని పురస్కరించుకుని గురువారం నెల్లూరు రామలింగాపురం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మనుమడు, కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డితో పాటు తెలుగుదేశం నాయకులు పత్తి రవీంద్రబాబు, పుచ్చకాయల రాఘవరెడ్డి, పి.సుధాకర్‌రెడ్డి, పి.రామకృష్ణారెడ్డి తదితరులు వెంకురెడ్డికి నివాళులర్పించారు.



# నేతలకు... ప్రతిదీ మేతే!

*ఒకర్ని చూసి ఒకరు తయారవుతున్నారేమోగాని... నేను సర్ఫెక్సల్ వేసి ఉతికిన తెల్లని వస్త్రం లాంటివాణ్ణి... నీతి, నిజాయితీలనే పదాలను నన్ను చూసే కనిపెట్టారన్నట్లు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇలాకాలో ఆయన తమ్ముళ్లు తెగ రెచ్చిపోతున్నారు. చంద్రబాబు చెబుతున్న నీతీనిజాయితీలు ఏ రకంగా ఉంటాయో చూపిస్తున్నారు. ధన దాహానికి దేనినీ వదలడం లేదు. ఆఖరకు తమ వ్యాపారం తాము చేసుకుంటుంటూరు... డబ్బుల కోసం ఇతరులను బెదిరించరు అన్న పేరున్న ఎమ్మెల్యేలు సైతం డబ్బులు కావాలని కాంట్రాక్టర్లను బెదిరిస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.*

వెంకటాచలం - ఓబులవారిపల్లి రైల్వేలైన్ నిర్మాణం పనులను గుజరాత్‌కు చెందిన మాంటేకార్లో సంస్థ చేపట్టింది. 2014లో 368కోట్ల విలువ చేసే రెండు ప్యాకేజీ పనులను ఈ కంపెనీ 12.5శాతం లెస్‌తో దక్కించుకుంది. రైల్వేశాఖతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 2017 జూలైకల్లా ఈ రైల్వేలైన్ పనులు పూర్తి చేయాలి. ఈ దశలో ఆ కంపెనీ భూసేకరణ, ఆక్రమణల తొలగింపు వంటివి పూర్తి చేసి రైల్వేలైన్ పనులను వేగంగానే చేస్తోంది. వెంకటాచలం నుండి ఓబులవారిపాలెం దాకా 80శాతం పనులు పూర్తి చేసారు. ఒక్క వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో 20శాతం పనులు పూర్తి కావాలి. అయితే ఇక్కడ పనులకు స్థానిక ఎమ్మెల్యే అడుగడుగునా అడ్డు తగిలాడని మాంటేకార్లో కంపెనీ ప్రతినిధుల ఆరోపిస్తున్నారు.

సోమవారం నెల్లూరులోని మినర్వా గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేసంలో మాంటేకార్లో కంపెనీ కార్యదర్శి కన్వేష్‌దేశాయ్ మాట్లాడుతూ ఈ నియోజకవర్గ పరిధిలో 183కోట్ల విలువైన పనులు జరుగుతుండగా అందులో 5శాతం కమిషన్‌గాని లేదా 5కోట్ల డబ్బు గాని తనకివ్వాలని కురుగొండ్ల రామకృష్ణ డిమాండ్ చేసారని ఆరోపించారు. దీనికి సంబంధించి తమ కంపెనీ సైట్ మేనేజర్ రాముతో కురుగొండ్ల ఫోన్‌లో చేసిన సంభాషణ సిడిలను మీడియాకు విడుదల చేశారు. ఎమ్మెల్యే రామకృష్ణ తమ సంస్థ అధికారులు, ఉద్యోగులు, కూలీలను బెదిరించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో తమ సిబ్బంది, కూలీలపై కొందరు తెలుగుదేశం నాయకులు దాడులు కూడా చేశారు. దీనిపై పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైనా ప్రయోజనం లేకుండా పోయింది. రైల్వేమంత్రి సురేష్‌ప్రభుకు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి టక్కర్‌కు కూడా ఎమ్మెల్యే బెదిరింపులపై ఫిర్యాదు చేసాము. సీఎంతో చెప్పుకున్నా నాకు భయం లేదని, అవసరమైతే సీఎంతోనే మాట్లాడుతానని ఎమ్మెల్యే అంటున్నారు. కూలీల మీద దౌర్జన్యం చేస్తుండడంతో భయపడిపోయి వాళ్లు పనులకు రావడం లేదు. ఎమ్మెల్యే బెదిరింపుల వల్ల గత ఆరు నెలలుగా పనులు కావడం లేదు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయకపోతే రైల్వేశాఖకు తాము భారీగా జరిమానా కట్టాల్సి వుంటుంది. రక్షణ లేకపోతే ఇక్కడ పనులు చేయడం కష్టం. రైల్వేశాఖకు ఈ విషయాన్ని చెప్పి పనులను ఆపేయడం తప్ప తమకు మరో గత్యంతరం లేదని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో కంపెనీ సీనియర్ ఇంజనీర్ రాధాకృష్ణ, ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జ్ తదితరులు పాల్గొన్నారు.


## విరుద్ధ వాదన



మాంటేకార్లో కంపెనీ వాళ్లు మీడియాకెక్కడంతో తెలుగుదేశం నాయకులు ఆత్మరక్షణలో పడ్డారు. ఆరోపణలు చేసింది ప్రతిపక్షం కాదు. రాష్ట్ర రాజకీయాలతో ఏ మాత్రం సంబంధం లేని గుజరాత్‌కు చెందిన కాంట్రాక్టర్లు. పచ్చ మీడియా దీనిని ఫోకస్ చేయలేదు కాబట్టి సరిపోయింది కాని లేకుంటే తెలుగుదేశం పరువు ఢమాలే! దేశంలోనే అవినీతిలో ఏపి నెం.1గా వుందన్న సర్వేల అంచనాలకు ఇదొక బలమైన ఆధారమై వుండేది. చంద్రబాబు దాకా విషయం పోవడంతో ఆయన ఆగ్రహం చెందారు. ఇట్లాంటి పనులు గుట్టుచప్పుడు కాకుండా చేసుకోవాలిగాని, చేతకాక ఇలా అల్లరి చేసుకోవడం ఆయనకు ఇష్టం ఉండదు. అందుకే పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్రను రంగంలోకి దించి నష్ట నివారణ చర్యలు చేపట్టారు. ఫోన్ సంభాషణను రికార్డ్ చేసిన ఆ కంపెనీ పాత ఇన్‌ఛార్జ్ రామును రంగంలోకిదించి ఆయన చేత ఓ హోటల్‌లో విలేకరుల సమావేశం పెట్టించారు. ఎమ్మెల్యే తనను 5కోట్లు డబ్బు అడగలేదని, పంచాయితీలకు ఆ కంపెనీ కట్టాల్సిన 28కోట్ల సీనరేజీని కట్టాలని ఒత్తిడి తెచ్చారని చెప్పారు. ఈ సమయంలో విలేకరులడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక అతను నన్ను వదిలేయండ్రాబాబూ... అంటూ బయటపడ్డాడు. ప్రతిపక్షం నుండి విమర్శల దాడి ఎక్కువ కావడంతో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్రలు ప్రత్యేకంగా విలేకరుల సమావేశం పెట్టారు. తనపై వచ్చిన ఆరోపణల విషయంలో సిబిఐ విచారణకైనా సిద్ధమని కురుగొండ్ల సవాల్ విసిరారు. 28కోట్ల రాయల్టీని ఎగ్గొట్టేందుకే ఆ కంపెనీవాళ్లు తనపై అభాండాలు వేస్తున్నారని ఆయన చెప్పుకొచ్చారు. రవిచంద్ర కూడా రామకృష్ణపై వచ్చిన అవినీతి ఆరోపణలను తిప్పికొట్టి ఆయనకు మద్దతుగా నిలిచారు. ఎన్నికల్లో అభ్యర్థులు కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఎమ్మెల్యేలుగా గెలిచాక అంతకు పాతికింతల సంపాదనపై దృష్టి పెడుతున్నారు. ఈ తపనలో దేనిని, ఎవరినీ వదలడం లేదు. అందుకే ఏపిలో కాంట్రాక్ట్‌లు చేయాలన్నా, ఇక్కడ పరిశ్రమలు పెట్టాలన్నా బయట ప్రాంతాల వారు భయపడుతున్నారు.







బాబా వారి మహా సమాధి, విజయదశమి మహోత్సవములు
గాంధీనగర్, ట్రంకురోడ్డు - నెల్లూరు.
తేది. 11-10-2016 మంగళవారం నుండి 13-10-2016 గురువారం వరకు
పై దినములలో ప్రతిరోజు ఉ॥ 7.00గం.ల నుండి శ్రీ బాబా వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు జరుగును.
తదుపరి మధ్యాహ్నం 12గంటల నుండి సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగును.
పై పూజలలో పాల్గొనదలచిన భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.75/- చెల్లించి తగిన రశీదు పొంది బాబా వారి తీర్థప్రసాదములు స్వీకరించవలసినదిగా కోరుచున్నాము. పై దినములలో ప్రతిరోజు సా॥ 7.00గం.లకు సాంస్కృతిక కార్యక్రమములు జరుగును.
ఇట్లు: కార్యవర్గము
శ్రీ షిర్డి సాయి బాబా మందిరం
గాంధీనగర్, ట్రంకురోడ్డు - నెల్లూరు. ఫోన్. 0861 - 2327771.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com